


దేవదాయశాఖలో ఈవోల బదిలీ

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 24: కర్నూలు, నంద్యాల జిల్లాలోని పలు ఆలయాలకు చెందిన ఈవోలను బదిలీ చేస్తూ దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యానారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. బి. చంద్రశేఖర్ (ఓర్వకల్లు కాల్వబుగ్గ), ఎ. నాగప్రసాద్ (బండి ఆత్మకూరు ఆలయాలు), డీఆర్‌కేఆర్ ప్రసాద్ (యాగంటి ఉమామహేశ్వర ఆలయం), ఈఆర్ వీరయ్య (శ్రీరంగనాథ ఆలయం, పెరవలి), ఎస్ మోహన్, (ఎ. కోడూరు ఆలయాలు), జి.వినోదా(ఆంజనేయ స్వామి ఆలయం, కోటపాడు), జె.జ్యోతి (ప్రాతకోట ఆలయాలు)ని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.



- రాష్ట్రంలో 20 కార్పొరేషన్లకు పదవుల భర్తీ
- టూరిజం కార్పొరేషన్ సభ్యురాలిగా కైప పద్మలతా రెడ్డి
- సివిల్ సప్లైస్ సభ్యుడిగా కొంగతి లక్ష్మీనారాయణ
- అర్బన్ ఫైనాన్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ సభ్యుడిగా రామాంజనేయులు
- జిల్లాలో ముగ్గురికి డైరెక్టర్ పదవులతోనే సరి
- నామినేటెడ్ పదవుల్లో ఆశావహులకు నిరాశ
- గత ఎన్నికల్లో టికెట్ త్యాగం చేసిన నేతలకు దక్కని స్థానం

తొలి జాబితాలో నిరాశ...!

కర్నూలు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి):

ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వంద రోజులు తరువాత రాష్ట్రంలో నామినేటెడ్ పదవుల పంపకాలకు శ్రీకారం చుట్టింది. టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు, జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ పురందేశ్వరి కసరత్తు చేసి.. రాజకీయ, సామాజిక సమీకరణాలను పరిగణలోకి తీసుకుని పదవుల పంపకాలు చేపట్టారు. తొలి విడతగా రాష్ట్రంలో 20 కార్పొరేషన్లకు చైర్మన్ పదవులతో పాటు పాలకవర్గ సభ్యుల పదవులను భర్తీ చేశారు. కర్నూలు నగర పాలక సంస్థ 17వ వార్డు కార్పొరేటర్, టీడీపీ నాయకురాలు కైప పద్మలతారెడ్డిని ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా, టీడీపీ కార్యదర్శి, రాయలసీమ ప్రాంత పద్మశాలి సంఘం అధ్యక్షుడు కొంగతి లక్ష్మీనారాయణను సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టరుగా, అర్బన్ ఫైనాన్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ సభ్యుడిగా కల్లూరు మండల టీడీపీ అధ్యక్షుడు రామాంజనేయులు ఎంపిక చేశారు. ఈ ముగ్గురికి మాత్రమే తొలి జాబితాలో స్థానం దక్కింది. గత ఎన్నికల్లో సీట్లు త్యాగం చేసిన నాయకులే కాకుండా కూటమి అభ్యర్థుల గెలుపు కోసం తీవ్రంగా కష్టపడిన నాయకులకు జాబితాలో స్థానం దక్కలేదు. దీంతో ఆశావహులతో పాటు, ఆయా వర్గాలకు చెందిన టీడీపీ శ్రేణుల్లో తీవ్ర నిరాశ అలుముకుంది. రెండో జాబితాలోనైనా స్థానం దక్కుతుందన్న ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఆ ముగ్గురికి డైరెక్టర్లుగా అవకాశం

గత ఎన్నికల్లో చేనేతల కోటాలో ఎమ్మిగనూరు టీడీపీ టికెట్ కోసం కొంగతి లక్ష్మీనారాయణ తీవ్రంగా ప్రయత్నించారు. పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్ రెడ్డికే టికెట్ ఇవ్వడంతో లక్ష్మీనారాయణకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పదవి, అనంతపురం అర్బన్ నియోజకవర్గం పరిశీలకులుగా బాధ్యతలు అప్పగించారు. తాజాగా సీఎం చంద్రబాబు ఎంపిక చేసిన నామినేటెడ్ పదవుల తొలి జాబితాలో సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్ (పాలవర్గం సభ్యుడు)గా ఈయనను ఎంపిక చేశారు. అలాగే గతంతో వైసీపీలో కొనసాగిన కేవీ సుబ్బారెడ్డి విద్యా సంస్థల అధినేత కేవీ సుబ్బారెడ్డి కుమార్తె, కర్నూలు నగరపాలక సంస్థ 17వ వార్డు కార్పొరేటర్ కైప పద్మలతా రెడ్డిని ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎంపిక చేశారు. 2023 మేలో జరిగిన రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో కేవీ సుబ్బారెడ్డి, కైప పద్మలతారెడ్డి చంద్రబాబు సూచన మేరకు వైసీపీలో ఉన్నా టీడీపీ గెలుపు కోసం పని చేశారు. ఈ ఏడాది జనవరిలో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. నాడు చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు పద్మలతారెడ్డికి టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్‌గా అవకాశం కల్పించారు. ఇక టీడీపీ కల్లూరు మండల అధ్యక్షుడిగా కొనసాగుతున్న డి.రామాంజనేయులుకు ఏపీ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ సభ్యుడిగా అవకాశం దక్కింది.

అధినేత చంద్రబాబు నమ్మకాన్ని నిలబెడుతా



టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు నాపై ఎంతో నమ్మకంతో తొలి జాబితాలోనే కీలకమైన సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్ పదవి ఇచ్చారు. అప్పగించిన బాధ్యతను నిజాయితీ, నిబద్ధతలతో నిర్వర్తించి న్యాయం చేస్తాను. యువనేత నారా లోకేశ్, పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌లకు కృతజ్ఞతలు.

- కొంగతి లక్ష్మీనారాయణ.

టూరిజం అభివృద్ధి కోసం కృషి చేస్తా



నాపై ఎంతో నమ్మకంతో సీఎం చంద్రబాబు, యువనేత నారా లోకేశ్, జిల్లాకు చెందిన పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ తొలి జాబితాలోనే టూరిజం కార్పొరేషన్ డైరెక్టరుగా ఎంపిక చేశారు. చాలా ఆనందంగా ఉంది. జిల్లాలో పర్యాటక అభివృద్ధి కోసం నా వంతు కృషి చేస్తాను.

- కైప పద్మలతారెడ్డి

నమ్మకాన్ని నిలబెట్టుకుంటా



నాపై నమ్మకంతో నామినేటెడ్ పోస్టు ఇప్పించిన పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత, నందికొట్కూరు టీడీపీ అధ్యక్షుడు గౌరు వెంకటరెడ్డిలకు రుణపడి ఉంటా. పార్టీ నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటా. రాష్ట్రస్థాయి పదవి రావడంపై మరింత బాధ్యత వచ్చినట్లయింది.

-డి.రామాంజనేయులు

● సర్వేలు చేసి పదవుల పంపకం

గత జగన్ ప్రభుత్వం, వైసీపీ నాయకుల వేధింపులు, అక్రమ కేసులు ఎదుర్కొని టీడీపీ కూటమి గెలుపు కోసం కష్టపడిన నాయకులు, కార్యకర్తలకు నామినేటెడ్ పదవుల ఎంపికలో తప్పకుండా న్యాయం చేస్తానని ప్రతిపక్షనేతగా ఉన్నప్పుడు అధినేత చంద్రబాబు, యువనేత నారా లోకేశ్ స్పష్టమైన భరోసా ఇచ్చారు. ఆ భరోసాతోనే గత ఎన్నికల్లో అప్పటి అధికార పార్టీ నాయకులు వేధింపులకు గురి చేసినా.. ఆర్థికంగా ఆశ చూపినా, బుజ్జగింపులు చేసినా వారికి లొంగకుండా కూటమి అభ్యర్థుల గెలుపు కోసం ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు కష్టపడ్డారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం నామినేటెడ్ పదవుల ఎంపిక కోసం సర్వేలు చేపట్టారు. దీంతో కష్టపడ్డ నాయకులు, కార్యకర్తలకు న్యాయం జరుగుతుందని అందరూ ఆశించారు. అయితే తొలి జాబితాలో ముగ్గురికి డైరెక్టర్ పదవులు మినహా.. ఏ ఒక్క నాయకుడికి కూడా రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ చైర్మన్ పదవి దక్కలేదు. అన్యాయం జరిగిందని ఓ వైపు తమ బాధను వ్యక్తం చేస్తూనే.. పొత్తులు, సమీకరణాల్లో భాగంగా తొలి జాబితాలో స్థానం దక్కలేదని ఆశావహులు చెబుతున్నారు. రాబోయే జాబితాలో తమ పేర్లు తప్పక ఉంటాయంటూ ఆత్మవిశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

త్యాగం చేసినవారికి మొండిచేయి!

గత వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్లు నియోజకవర్గంలో టీడీపీ బలోపేతం కోసం ఆ పార్టీ ఇన్‌చార్జిలు తీవ్రంగా కష్టపడ్డారు. అధిష్ఠానం ఏ కార్యక్రమం ఇచ్చినా నాటి జగన్ ప్రభుత్వం వేధింపులు ఎదుర్కొని పని చేశారు. అంతేకాదు బాదుడే.. బాదుడు, ప్రజాగళం పేరిట అధినేత చంద్రబాబు, యువగళం పాదయాత్ర పేరిట యువనేత నారా లోకేశ్, నిజం గెలవాలి కార్యక్రమం పేరిట నారా భువనేశ్వరి నియోజకవర్గాలకు వచ్చినప్పుడు జనసమీకరణ, సభలు, సమావేశాల ఏర్పాట్లు కోసం నియోజకవర్గం ఇన్‌చార్జిలు రూ.కోట్లు చేశారు. గత వైసీపీ ప్రభుత్వం రాజకీయ కుట్రలో భాగంగా స్కిల్ డెవలప్‌మెంట్ స్కాం పేరుతో చంద్రబాబును అరెస్టు చేస్తే.. 53 రోజులు వివిధ రూపాల్లో ఆందోళనలు చేసి ప్రజల్లోకి వెళ్లారు. 2024 ఎన్నికల్లో టీడీపీ టికెట్ తమకే వస్తుందనే ధీమాతో ముందుకు సాగారు. అయితే సామాజిక సమీకరణలో భాగంగా మంత్రాలయం టికెట్ ఇన్‌చార్జి పి.తిక్కారెడ్డిని కాదని వాల్మీకి సామాజికవర్గానికి చెందిన ఎన్.రాఘవేంద్రరెడ్డికి, డోన్ టికెట్ కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డికి ఇచ్చారు. ఆలూరు ఇన్‌చార్జి కోట్ల సుజాతమ్మను కాదని బి.వీరభద్రగౌడ్‌కు టికెట్ ఇచ్చారు. కూటమి పొత్తుల్లో భాగంగా ఆదోని బీజేపీకి కేటాయించడంతో టీడీపీ ఇన్‌చార్జి కె.మీనాక్షినాయుడుకు టికెట్ దక్కలేదు. రాజకీయ సమీకరణల్లో భాగంగా కోడుమూరు ఇన్‌చార్జి ఆకేపోగు ప్రభాకర్‌ను కాదని టీడీపీ సీనియర్ నేత విష్ణువర్ధన్‌రెడ్డి వర్గానికి చెందిన బొగ్గుల దస్తగిరికి ఇచ్చారు. అంటే ఈ నాలుగు నియోజకవర్గాల్లో ప్రతిపక్షంలో ఐదేళ్లు టీడీపీ ఇన్‌చార్జిలుగా పార్టీ బలోపేతం కోసం పని పనిచేశారు. చివరి క్షణంలో టికెట్ త్యాగం చేయడంతో నామినేటెడ్ పదవుల కేటాయింపుల్లో తొలి ప్రాధాన్యత ఇస్తానని నాడు చంద్రబాబు హామీ ఇచ్చారని అంటున్నారు. వీరితో పాటు ఎన్నికల ముందు ఎంపీ పదవికి, వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరిన కర్నూలు మాజీ ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్, పత్తికొండ టికెట్ ఆశించి అబ్బాయి కోసం రాజీపడిన మాజీ మంత్రి కేఈ ప్రభాకర్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, పార్టీ సీనియర్ నేత విష్ణువర్ధన్‌రెడ్డి సహా పలువురు ముఖ్యనాయకులు నామినేటెడ్ పదవుల ఎంపిక తొలి జాబితాలో తమ పేరు ఉంటుందని ఆశించారు.

సీడ్ కార్పొరేషన్ చైర్మన్‌గా ధర్మవరం సుబ్బారెడ్డి



డోన్, సెప్టెంబరు 24: నామినేటెడ్ పోస్టుల విషయంలో విధేయత, నిరంతర ప్రజా సంబంధాలే తెలుగుదేశం పార్టీ గీటురాయిగా తీసుకుంది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నామినేటెడ్ పోస్టుల తొలి జాబితాలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి ధర్మవరం సుబ్బారెడ్డికి సీఎం చంద్రబాబు సముచిత స్థానం కల్పించారు. కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన సుబ్బారెడ్డిని రాష్ట్ర సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఎంపికయ్యారు. డోన్ నియోజకవర్గంలో ధర్మవరం సుబ్బారెడ్డికి మంచి పట్టు ఉంది. టీడీపీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో డోన్ నియోజకవర్గంలో పార్టీ క్లిష్ట పరిస్థితులను ఎదుర్కోవాల్సి వచ్చింది. ఆ సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబు డోన్ నియోజకవర్గ టీడీపీ బాధ్యతలను సుబ్బారెడ్డికి అప్పగించారు. నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి మూడేళ్ల పాటు సుబ్బారెడ్డి పని చేశారు. కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచి సుబ్బారెడ్డి టీడీపీ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లారు. దీంతో ఎన్నికలకు ఏడాది ముందు డోన్ పర్యటనకు వచ్చిన సమయంలో చంద్రబాబు నాయుడు డోన్ టీడీపీ అభ్యర్థిగా సుబ్బారెడ్డి పేరును ప్రకటించారు. అలాగే ప్యాపిలి పర్యటనలోనూ సుబ్బారెడ్డిని అభ్యర్థిగా ప్రకటించారు. అయితే ఆ తర్వాత మారిన రాజకీయ పరిణామాలతో డోన్ అసెంబ్లీ టికెట్‌ను కోట్ల సూర్యప్రకాష్ రెడ్డికి కేటాయించారు. టీడీపీ అధినేత చంద్రబాబు స్వయంగా జోక్యం చేసుకుని న్యాయం చేస్తానని సుబ్బారెడ్డికి హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నామినేటెడ్ పదవి ఎట్టకేలకు సుబ్బారెడ్డిని వరించింది. ఈ సందర్భంగా ధర్మవరం సుబ్బారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌లు తన సేవలను గుర్తించి రాష్ట్ర సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇచ్చారన్నారు. వారి నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పని చేస్తానన్నారు. తన ఎంపికకు సహకరించిన మంత్రులు, ఎమ్మెల్యేలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

డీఈఈల బదిలీ

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 24: ఉమ్మడి జిల్లాలోని కార్పొరేషన్, మున్సిపాలిటీలలో డీఈఈలు, ఏఈఈలను బదిలీ చేస్తూ పబ్లిక్ హెల్త్ ఇంజనీర్ ఇన్ చీఫ్ ఆర్.గోపాలకృష్ణారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. నంద్యాల డీపీహెచ్‌ఈవోలో డీఈఈగా పని చేస్తున్న జి.గంగాధర్, నంద్యాల మున్సిపాలిటీలో పని చేస్తున్న జి.శ్రీనివాసరెడ్డి, ఎమ్మిగనూరులో పని చేస్తున్న జి.మనోహర్‌రెడ్డిని నగర పాలక సంస్థకు బదిలీ చేశారు. నగర పాలకలో పని చేస్తున్న ఆర్. రాజశేఖర్‌ను ఆదోనికి, కె.రవిప్రకాష్‌నాయుడును రాయదుర్గం, బి.గోపాలకృష్ణను ఏపీఎంఎస్ఐడీసీ మంగళగిరికి డిప్యూటేషన్ ప్రాతిపదికన నియమించారు. ఆదోనిలో పని చేస్తున్న బి. రాజునాయక్ ఎమ్మిగనూరుకు, ఒ.నాగభూషణ్‌రెడ్డిని నంద్యాలకు, కుడాలో పని చేస్తున్న ఎం. నాసిర్‌ను నందికొట్కూరుకు, ఇక్కడే పని చేస్తున్న నాయబ్ రసూల్‌ను కుడాకు, గుంతకల్‌లో పని చేస్తున్న సి.రమణమూర్తిని ఆదోని, అనంతపురం ఏపీ టిడ్కోలో పని చేస్తున్న సి.పవన్‌కుమార్‌ను నంద్యాల, డోన్‌లో పని చేస్తున్న వై.రఘు గుత్తికి, ఇక్కడే పని చేస్తున్న డి.రసూల్‌ను గుత్తికి బదిలీ చేశారు. వీరితో పాటు నగర పాలక కార్యాలయంలో పని చేస్తున్న ఏఈఈ బి.దినేష్‌కుమార్‌ను నందికొట్కూరుకు, కె.జనార్దన్‌ను ఆదోనికి, ఆళ్లగడ్డలో పని చేస్తున్న కె.సురేంద్రనాథ్‌ను ప్రొద్దుటూరుకు, ఆదోనిలో పని చేస్తున్న ఎం.కృపాకర్‌ను గూడూరుకు బదిలీ చేశారు.

పర్యాటక ప్రాంతాలకు రూ.3.33 కోట్లతో రోడ్లు

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 24: పర్యాటక అభివృద్ధిలో భాగంగా జిల్లాలో పర్యాటక ప్రాంతాలకు రూ.3.33 కోట్లతో రోడ్లు మంజూరు చేసినట్లు కలెక్టర్ పి. రంజిత్ బాషా మంగళవారం పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని పర్యాటక ప్రాంతాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు కలెక్టర్ చాంబరులో రూపొందించిన ప్రదర్శన బోర్డును కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న మతపరమైన పర్యాటక ప్రాంతాలు, ఎకో టూరిజం స్పాట్స్, హెరిటేజ్ టూరిజం ప్రాంతాల వివరాలు ప్రజలకు సమగ్రంగా తెలిసేలా ప్రదర్శన బోర్డులను ఏర్పాటు చేసి అన్ని పర్యాటక ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్నామన్నారు. పర్యాటక అభివృద్ధిలో భాగంగా జిల్లాలోని పర్యాటక ప్రాంతాలకు రూ.3.33 కోట్లతో అప్రోచ్ రోడ్లు, సీసీ రోడ్లు మంజూరు చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పర్యాటక శాఖ అధికారి విజయ పాల్గొన్నారు.

అమ్మో.. అక్కడా..!

- మూడు ఏ-గ్రేడ్ సెంటర్లకు రిజిస్ట్రార్ల కొరత
- కర్నూలు, కల్లూరు, ఆదోని వైపు చూడని ఉద్యోగులు
- 2024-25 జనరల్ బదిలీల్లో భర్తీకాని స్థానాలు
- మళ్లీ ఇన్‌చార్జిలే దిక్కు?



కల్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

కల్లూరు, సెప్టెంబరు 24: జిల్లాలోని మూడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు సబ్ రిజిస్ట్రార్లుగా వెళ్లాలంటేనే జంకుతున్నారు. కర్నూలు జిల్లాలో అత్యధిక ఆదాయం సమకూర్చే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కర్నూలు, కల్లూరు, ఆదోని కీలకమైనవి. ఈ కేంద్రాలకు సబ్ రిజిస్ట్రార్లు రావాలంటేనే హడలెత్తిపోతున్నారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ నిబంధనల్లో భాగంగా 2 సంవత్సరాలు పూర్తి చేసుకున్న వారికి బదిలీ చేసేందుకు ఉత్తర్వులు ఇచ్చింది. 2024-25 బదిలీల కౌన్సెలింగ్‌లో కర్నూలు, కల్లూరు, ఆదోని సబ్ రిజిస్ట్రార్ స్థానాలకు ఒక్కరంటే ఒక్కరు కూడా ఆప్షన్స్ ఇచ్చుకోలేదని ఆ శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. కౌన్సెలింగ్ ఉద్యోగులు ఎంపిక చేసుకున్న స్థానాలకు ఉద్యోగులను బదిలీ చేసినట్లు ఉన్నతాధికారులు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు బదిలీల ప్రక్రియ చేపట్టినా ఈ మూడు కేంద్రాలు ఖాళీగానే దర్శనమిస్తున్నాయి. ఆ స్థానాలకు ఇన్‌చార్జ్‌లను నియమించనున్నట్లు తెలుస్తోంది. ఈ కార్యాలయాల్లో అవినీతి, ఆరోపణలు అధికంగా రావడం, ఇక్కడ పనిచేసే వారిపై బదిలీ కన్నా సస్పెన్షన్లే అధికంగా ఉండటంతో అధికారులు భయపడుతున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 24 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా అందులో రూ.50 కోట్లకు పైగా ఆదాయం వచ్చే ఏ-గ్రేడ్ సెంటర్లు-5, రూ.50 కోట్లలోపు ఆదాయం వచ్చే బి-గ్రేడ్ సెంటర్లు-5, రూ.15 కోట్లలోపు ఆదాయం సమకూరే సి-గ్రేడ్ సెంటర్లు -14 ఉన్నాయి. ప్రభుత్వానికి అత్యధిక ఆదాయం సమకూరే కర్నూలు, కల్లూరు, ఆదోని సబ్‌రిజిస్ట్రార్లుగా రావడానికి అనాసక్తి చూపుతున్నారు.

● సబ్ రిజిస్ట్రార్లకు ఉత్తర్వులు

2024-25 సాధారణ బదిలీల్లో భాగంగా గత ఆదివారం వెంకటరమణ కాలనీలోని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. డీఐజీ కళ్యాణి నిబంధనల మేరకు రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సబ్ రిజిస్ట్రార్లకు బదిలీ ఉత్తర్వులను మంగళవారం జారీ చేశారు. కర్నూలు రిజిస్ట్రార్ కార్యాలయంలో చిట్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సి. జనార్దన్ కన్నా డీఐజీ ఆఫీసు సూపరింటెండెంట్‌గా, నందికొట్కూరు సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న యం.చంద్రమౌళిని కర్నూలు మార్కెట్ వ్యాల్యూ, ఆడిట్, పాణ్యం ఎస్ఆర్వో టి. తేజోవతిని కోడుమూరుకు, బేతంచెర్ల ఎస్ఆర్వో కె.అబ్దుల్‌కరీంను ఆత్మకూరు, ఆత్మకూరు ఎస్ఆర్వో ఎం.ఆదినారాయణను బండిఆత్మకూరు ఎస్ఆర్వోగా, డోన్ ఎస్ఆర్వో వై.బజారిని కోసిగి ఎస్ఆర్వోగా, బండిఆత్మకూరు ఎస్ఆర్వో జేవీఎన్.రాజును పాణ్యం ఎస్ఆర్వోగా, ఉరవకొండ ఎస్ఆర్వో కుంచపు శ్రీనివాసులును ఎమ్మిగనూరు ఎస్ఆర్వోగా, ప్యాపిలి ఎస్ఆర్వో ఎస్ఏఆర్.ఫైరోజ్‌ను ఓర్వకల్లుకు, ఆళ్లగడ్డ ఎస్ఆర్వో ఎస్.అబ్దుల్ సత్తార్‌ను నంద్యాల ఎస్ఆర్వో-1గా, కోడుమూరు ఎస్ఆర్వో ఎస్.మహబూబ్‌బాషాను డోన్, కదిరి జాయింట్-2 ఎస్ఆర్వో జి.మల్లికార్జునను ఆలూరు, సిద్ధవటం ఎస్ఆర్వో జి.రాజా చంద్రమౌళిని పత్తికొండ, పత్తికొండ ఎస్ఆర్వో ఎస్యం. మౌలాను నందికొట్కూరు, గూడూరు ఎస్ఆర్వో కె.శివకుమార్‌ను కోవెలకుంట్ల, నంద్యాల ఎస్ఆర్వో -2 సి.వనితాలక్ష్మిని బేతంచెర్ల, ఓర్వకల్లు ఎస్ఆర్వో పి.జయవాణిని ప్యాపిలి, కర్నూలు ఎస్ఆర్వో-2 యం.చైతన్యరాయులును ఆళ్లగడ్డకు బదిలీ చేశారు.

ఆ ముగ్గురు తీవ్ర ప్రయత్నాలు

గతంలో ఉమ్మడి కర్నూలుల్లో పనిచేసి అవినీతి, అక్రమాలు, ఏసీబీ ట్రాప్‌లో పట్టుబడి సస్పెన్షన్‌లో ఉన్న ముగురు సబ్ రిజిస్ట్రార్లను ఆ ప్యానెల్‌లోకి తీసుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చినట్లు సమాచారం. ఈ క్రమంలో ఆ ముగ్గురు అధికారులకు జిల్లాలో సబ్ రిజిస్ట్రార్లుగా నియమించే అవకాశం ఉందని సబ్ రిజిస్ట్రార్ల సంఘం నేత ఒకరు తెలిపారు.

జగన్‌ను దేశ బహిష్కరణ చేయాలి

- టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి డిమాండ్
- జగన్ దిష్టిబొమ్మను దహనం చేసిన టీడీపీ నాయకులు



జగన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న టీడీపీ నాయకులు

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 24: వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదాన్ని కల్తీకి పాల్పడిన జగన్‌రెడ్డిని దేశ బహిష్కరణ చేయాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయం ఎదుట విశ్వేశ్వరయ్య సర్కిల్‌లో జగన్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యాక్రమాన్ని తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు అబ్బాస్, సోమిశెట్టి నవీన్, పీజీ గోపీనాథ్, నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వారు మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో రాష్ట్రాన్ని జగన్ సర్వనాశనం చేశారని, ఇది చాలదన్నట్లు వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలోని లడ్డుకు వాడే నెయ్యిలో కల్తీకి ఆద్యుడయ్యారని ధ్వజమెత్తారు. తనకున్న హిందూ మతద్వేశాన్ని ఇలా బయట పెట్టుకున్నారని అన్నారు. వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జగన్మోహన్‌రెడ్డిపై సీబీసీఐడీ విచారణ జరిపించి కఠిన శిక్ష పడేలా చూడాలని కోరారు. గతంలో టీటీడీ చైర్మన్‌లుగా పని చేసిన వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డి, ఈవో ధర్మారెడ్డిపై ప్రభుత్వం విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పరమేష్, రమణమ్మ, డి.జేమ్స్, రామకృష్ణుడు, విజయలక్ష్మి, గున్నామర్క్ తదితరులు పాల్గొన్నారు.

134 మంది టీచర్లకు నోటీసులు

కర్నూలు(ఎడ్యుకేషన్), సెప్టెంబరు 24: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న 134 మంది ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ మంగళవారం తెలిపారు. వీరు అటెండెన్స్ యాప్‌లో హాజరు చేయలేదని, అందువల్ల వారిపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో సంజాయిషీ ఇవ్వాలని నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు పాఠశాలల పనివేళలు తప్పక పాటించాలని, లేదంటే చర్యలు కఠినంగా తీసుకుంటామని హెచ్చరించారు.

రాజకీయం నేనే చేస్తానంటే కుదరదు

ఎమ్మెల్యే పార్థసారథిపై బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ జైన్ సంచలన వ్యాఖ్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రకాష్ జైన్

ఆదోని, సెప్టెంబరు 24: ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథిపై సొంతపార్టీ నేత, మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ జైన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. 'రాజకీయం తానే చేస్తానని ఎమ్మెల్యే అంటే కుదరదు..' అంటూ ఆయన అన్నారు. మంగళవారం ఆదోని మండలం నాగలాపురం గ్రామంలో మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన 'మంచి ప్రభుత్వం' కార్యక్రమానికి ప్రకాష్ జైన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదోని ఎమ్మెల్యేగా ప్రజలు పార్థసారథిని ఎన్నుకున్నారంటే అది కేవలం మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు, తన వల్లేనని అన్నారు. ఆదోని ప్రజలకు ప్రస్తుత ఎమ్మెల్యే ఎవరో తెలియదని అన్నారు. ఆదోని ప్రజలకు ఏం చేయాలో తమ ఇద్దరికే బాగా తెలుసు అని అన్నారు. ఇక్కడ పరిస్థితులకు అనుగుణంగా రాజకీయం చేస్తూ అభివృద్ధి వైపు నడిపించాలన్నారు. కానీ ఎమ్మెల్యే ఒంటెత్తు పోకడతో ఎవరినో ఒకరిని పట్టుకుని తిరిగితే తాము సహకరించే ప్రసక్తే లేదన్నారు. 43 ఏళ్ల తన రాజకీయ జీవితంలో ఇలా ఎవరూ వ్యవహరించలేదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ దేవేంద్రప్ప, ఉమాపతి నాయుడు, అధికారులు పాల్గొన్నారు.

గుండె వ్యాధుల నివారణపై అవగాహన అవసరం



పోస్టర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 24: గుండె వ్యాధుల నివారణపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని కలెక్టర్ పి.రంజిత్ బాషా అన్నారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ప్రపంచ హృదయ దినోత్సవానికి సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్, కర్నూలు హార్ట్ ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ పి.చంద్రశేఖర్‌తో కలిసి విడుదల చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన ఆహారం, శరీరానికి వ్యాయామం, చెడు వ్యసనాలకు దూరంగా ఉండటం వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుం దన్నారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ కర్నూలులో హార్ట్ ఫౌండేషన్- 2002లో మొదలు పెట్టామని, అప్పటి నుంచి క్రమం తప్పకుండా ప్రతి సంవ త్సరం సెప్టెంబరు 29న ప్రపంచ హృదయ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నా మన్నారు. ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్లు కల్యాకర చంద్రశేఖర్, డాక్టర్ భవానిప్రసాద్, కోశా ధికారి రాముడు, సభ్యులు శర్మ, లక్ష్మణ్, వాసుదేవమూర్తి పాల్గొన్నారు.

భూములను రక్షించాలి



ధర్నా చేస్తున్న వివిధ కాలనీల అసోసియేషన్ ప్రతినిధులు

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 24: హైడ్రా వంటి చట్టం తెచ్చి చెరువులు, ప్రభుత్వ భూములు, వాగులు, జగన్నాథగట్టును కబ్జాల బారి నుంచి రక్షించాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఇరిగినేని పుల్లారెడ్డి, ఎం.నాగరాజు అన్నారు. మంగళవారం పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వివిధ కాలనీల అసోసియేషన్ల ప్రతిని ధులు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈసందర్భంగా పుల్లారెడ్డి మాట్లాడుతూ కర్నూలు ప్రజలకు అందు బాటులో ఉండేది నగరవనమని, దాని ఎదుట ఉన్న చెరువు, అలుగు ద్వారా వెళ్లే వరదనీటి వాగును, ప్రభుత్వ భూమి, ఆర్‌అండ్‌బీ రోడ్డు కబ్జాకు గురైనా అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో రిటైర్డు డీఎస్పీ పాపారావు, శ్రీనివాసులు, అన్వర్‌బాషా, పీటర్, అస్సలాం, మధు, రమణగౌడు, ఉజేర్ అహ్మద్, శ్రీనివాసరెడ్డి, కృష్ణ, వన్నూరు సాహెబ్, రాజు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కొరటాల జీవితం నేటి తరాలకు ఆదర్శం

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 24: సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులుగా, ఉమ్మడి ఏపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పని చేసిన కొరటాల సత్యనారాయణ జీవితం నేటి తరానికి ఆదర్శమని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పి.నిర్మల అన్నారు. మంగళవారం సీపీఎం జిల్లా కార్యాలయంలో కొరటాల శత జయంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్మల మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో సుందరయ్య, బసవ పున్నయ్యల వంటి నాయకులతో పని చేశారని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గసభ్యుడు కేవీ.నారాయణ, న్యూసిటీ కార్యదర్శి టి.రాముడు, కే.అరుణ పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 24: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీయూ నగర అధ్యక్షుడు ఆర్.నరసింహులు పిలుపునిచ్చారు. మంగళవారం ఏపీ వేర్‌హౌస్ గోడౌన్ హమాలీ యూనియన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం గురించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. 44 లేబర్ కోడ్లను నాలుగు కోడ్‌లుగా చేసి యజమానులకు అనుకూలంగా కార్మికులకు వ్యతిరేకంగా చట్టాలు తీసుకువస్తున్నారని మండిపడ్డారు. ఈసమావేశంలో నాయ కులు విష్ణుమూర్తి, మల్లికార్జున, రంగన్న, సుధాకర్ పాల్గొన్నారు.

సామాజిక స్పృహ పెంచుకోవాలి

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 24: విద్యార్థి దశ నుంచే సామాజిక స్పృహ పెంచుకోవాలని డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ వర్సిటీ రిజిస్ట్రార్ వి.లోకనాథ్ అన్నారు. మంగళవారం వర్సిటీలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఎన్ ఎస్ఎస్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు క్యాంపస్‌లో ప్లాస్టిక్, చెత్తను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్ర మంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎస్ మహబూబ్ బాషా, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ వెంకటప్ప, పాల్ కృపాకర్, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

● రాయలసీమ యూనివర్సిటీలో ఎన్ఎస్ఎస్ డే సందర్భంగా తలసే మియా పిల్లల సహాయార్థం రక్తదాన శిబిరం నిర్వహించారు. రిజిస్ట్రార్ ఎస్ వెంకటేశ్వర్లు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ పి.నాగరాజులు ఈ శిబిరాన్ని ప్రారం భించారు. సొసైటీ తరఫున జీ సురేష్, వడ్డే రమేష్‌లు రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వై.హరిప్రసాదరెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్లు రత్నం, నాగచంద్రుడు, శివప్రసాద్‌రెడ్డి, విజయ్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు

సి.బెళగల్, సెప్టెంబరు 24: బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల ప్రత్యేక అధికారి శ్యామల హెచ్చరించారు. బుధవారం మండలంలోని పోలకల్లు గ్రామంలో సర్పంచ్ మాదక్క అధ్యక్షతన మహిళ లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా శ్యామల మాట్లాడుతూ సి. బెళగల్ మండలం బాల్య వివాహాలు చేయడంలో మొదటి స్థానంలో ఉందన్నారు. ఎంపీడీవో రాముడు, ఈవో ఆర్డీ సందీప్, పంచాయతీ కార్యదర్శి సునీల్ రాణి పాల్గొన్నారు.

'ప్రైవేటు ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలి'

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 24: ఆరోగ్యశ్రీ రోగుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న ప్రైవేటు ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ నాయకులు డీఎంహెచ్‌వోకు వినతిపత్రం అందజేశారు డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేంద్ర, నగేష్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ రోగుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న ఆస్పత్రులపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలని కోరారు.

పారదర్శక పాలనే కూటమి ప్రభుత్వ లక్ష్యం

పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత

కల్లూరు, సెప్టెంబరు 24: పారదర్శక పాలన అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. మంగళవారం కల్లూరు అర్బన్ 32వ వార్డు ముజఫర్‌నగర్‌లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి నంద్యాల పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్‌తో కలిసి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈసందర్భంగా గౌరు చరిత మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఎన్డీఏ ప్రభుత్వం సంక్షోభంలోనూ ప్రజా సంక్షేమానికే పెద్దపీట వేసిందన్నారు. ల్యాండ్‌టైట్లింగ్ యాక్ట్ రద్దు, పింఛన్ల పెంపు, అన్నా క్యాంటీన్ల ప్రారంభం, డీఎస్సీ నోటిఫికేషన్, ఉద్యోగులకు ఒకటో తేదీనే వేతనాలు అం దించేందుకు చర్యలు తీసుకున్నారన్నారు. అనంతరం ముజఫర్‌నగర్ ప్రభు త్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఎమ్మెల్యే తనిఖీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు టైలర్ నాగరాజు, ఖాజాబందే నావాజ్, గిరి, ఇబ్రహీం, ఎన్వీ.రామకృష్ణ, సోమన్న, ఎస్.ఫిరోజ్, జవ్వాజి గంగాధర్‌గౌడ్, కాసాని మహేష్‌గౌడ్, పీయూ మాదన్న పాల్గొన్నారు.

వంద రోజుల పాలనలో అన్నివర్గాలకు మేలు: కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనలో అన్నివర్గాలకు మేలు చేసిందని 36వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి ఆర్.తిరుమలేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం 36వ వార్డు రాజీవ్ గృహకల్పలో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని ఇంటింకీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేసి స్టిక్కర్లు అతికిం చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శివశంకర్, కురువ ధనుంజయ, లక్ష్మణ్, కె.మధు తదితరులు పాల్గొన్నారు.

● కల్లూరు మండలం అయ్యవారి నాగలాపురంలో టీడీపీ సీనియర్ నాయకుడు రెడ్డిగారి చంద్రకళాధర్‌రెడ్డి ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామంలో ఇంటింకీ తిరిగి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను ప్రజలకు వివరించారు. తెలుగు యువత నాయకుడు కె.శేఖర్, బీచుపల్లి ప్రజలు పాల్గొన్నారు.

● కల్లూరు అర్బన్ 34వ వార్డులో నంద్యాల జిల్లా కోశాధికారి పీయూ మాదన్న ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం కాలనీలో ఇంటింకీ తిరిగి ప్రభుత్వం వంద రోజుల్లో చేపట్టిన మంచి పనులు ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వెంకటేశ్వరరెడ్డి, నారాయణగౌడ్, డాకేష్‌గౌడ్, మహమ్మద్‌రఫీ, తెలసీ కృష్ణ పాల్గొన్నారు.

స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మార్చుకుందాం: ఎమ్మెల్యే

సి.బెళగల్: ఏపీని స్వరాంధ్రప్రదేశ్‌గా మార్చుకుందామని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. బుధవారం మండలంలోని పోలకల్లులో





రాజీవ్‌గృహకల్పలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఆర్. తిరుమలేశ్వరరెడ్డి, అయ్యవారి నాగలాపురంలో స్టిక్కర్లను అతికిస్తున్న ఆర్.చంద్రకళాధర్‌రెడ్డి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న గౌరు చరిత, మల్లెల రాజశేఖర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దస్తగిరి

సర్పంచ్ మాదక్క అధ్యక్షతన ఇది మా మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే దస్తగిరి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ వందరోజుల పాలనలో పింఛన్లు పెంపు, డీఎస్సీ నోటిఫి కేషన్, పంచాతీలకు నిధులు, పేదల ఆకలి తీర్చేందుకు అన్నక్యాంటీన్లను ఏర్పాటు చేశారని అన్నారు. 2047 విజన్‌తో సీఎం చంద్రబాబు ప్రణాళికలు అమలు చేస్తున్నారని, మంచి ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి శ్యామల, పంచాయతీ ప్రత్యేక అధికారి రోనాల్డు, టీడీపీ మండల కన్వీనర్ గోవిందుగౌడు, మాజీ మండల కన్వీనర్ తిమ్మప్ప, అమర్, సోమన్న, మాజీ జడ్పీటీసీ చంద్రశేఖర్, బాలాజీ వెంకటేశ్, బీమన్న, మాజీ ఎంపీటీసీ ధనుంజయుడు, దూద్‌వలి పాల్గొన్నారు.

పెండింగ్ జీతాలు విడుదల చేయాలి



నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

కర్నూలు(ఎడ్యుకేషన్), సెప్టెంబరు 24: సమగ్ర శిక్ష ఉద్యోగుల పెండింగ్ జీతాలు విడుదల చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం మధ్యాహ్నం భోజనం విరామం సమయంలో ఆగస్టు, సెప్టెంబరు నెలల జీతాల బడ్జెట్ విడుదల చేయాలని ఉద్యోగులు నిరసన కార్యక్రమం చేపట్టారు. హెచ్ఆర్ పాలసీ, మినిమం టైం స్కేల్ అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు పాల్గొన్నారు.

'స్పెషల్ సమ్మరి రివిజన్'పై టెలీ కాన్ఫరెన్స్

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 24: స్పెషల్ సమ్మరీ రివిజన్ అంశంపై మంగళవారం ఈఆర్వో, ఏఈఆర్‌వోలతో కలెక్టర్ పి.రంజిత్ బాషా టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక సంక్షిప్త సవరణకి సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఫార్మ్‌లను వంద శాతం పరిష్కరించాలని ఈఆర్‌వోలను ఆదేశించారు. ఇంటింటి వెరిఫికేషన్‌లో జిల్లా సగటు 98.31 శాతం ఉంటే ఆదోని అసెంబ్లీ నియోజకవర్గంలో మాత్రం ఇంకా 94. 73 శాతం పూర్తయిందని ఇందులో పురోగతి తీసుకుని రావాలని ఆదోని సబ్ కలెక్టర్‌ను సూచించారు. అదేవిధంగా మిగిలిన అసెంబ్లీ నియోజకవర్గాల్లో కూడా పెండింగ్‌లో ఉన్న ఇంటింటి వెరిఫికేషన్‌ను త్వరగా పూర్తి చేయాలన్నారు. టెలీ కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్, బి.నవ్య తదితరులు పాల్గొన్నారు.

బీచ్ సెపక్‌తక్రాలో భారత జట్టుకు కాంస్యం

కర్నూలు(స్పోర్ట్స్), సెప్టెంబరు 24: చైనా దేశంలోని కింగ్ డావోలో ఈ నెల 18 నుంచి 23 వరకు జరిగిన ఆసియా బీచ్ సెపక్‌తక్రాలో పురుషుల భారత జట్టు కాంస్యం పతకాన్ని దక్కించుకుంది. వరుసగా ప్రత్యర్థి దేశాల జట్లపై విజయాలు సాధిస్తూ సెమిఫైనల్స్‌లో జరిగిన పోటీల్లో ప్రత్యర్థిపై పరాజయం చెంది కాంస్యం సాధించింది. ఇందులో కర్నూలు జిల్లాకు చెందిన కురువ మధు భారత జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించారు. ఆలూరు చెందిన మధు గతంలో అనేక రాష్ట్ర జాతీయ స్థాయిలో పాల్గొన్న కారణంగా ఇటీవల ఢిల్లీలో జరిగిన భారత జట్టు ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబర్చి జట్టులో స్థానం సంపాదించారు. చైనా దేశంలో జరిగిన ఆసియా పోటీల్లో మన రాష్ట్రం నుంచి పాల్గొని పతకాలతో తిరిగి వస్తున్న మధుకు రాష్ట్ర సెపక్ తక్రా సంఘం సభ్యుల తరఫున అధ్యక్షకార్యదర్శులు అభినందనలు తెలిపారు.

రాష్ట్ర వ్యాప్త దీక్షలను విజయవంతం చేయండి

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 24: వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో అక్టోబరు ఒకటో తేదీన జరిగే రాష్ట్ర వ్యాప్త దీక్షలను విజయవంతం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్ పిలుపునిచ్చారు. మంగళవారం సీఆర్ భవన్‌లో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ పీడీఎస్‌యూ నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతూ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు దశల వారి ఉద్యమంలో రాష్ట్రవ్యాప్తంగా దీక్షలు చేపడుతున్నామన్నారు. ఈ సమావేశంలో నాయకులు సోమన్న, బీసన్న, అబ్దుల్లా, అఖండ, మహేంద్ర పాల్గొన్నారు.

చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం



చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న న్యాయవాదులు

కోడుమూరు, సెప్టెంబరు 24: టీడీపీ ప్రభుత్వం కర్నూలు జిల్లాలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తూ, అలాగే న్యాయవాదులకు నెలకు రూ.10వేలు ఇవ్వడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్ర పటానికి న్యాయవాదులు క్షీరాభిషేకం చేశారు. సీనియర్ న్యాయవాది ఎర్రదొడ్డి శ్రీనివాసులు ఆధ్వర్యంలో స్థానిక కోట్ల సర్కిల్లో మంగళవారం చంద్రబాబు చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. న్యాయవాదులు గిత్త రమేష్, మద్దిలేటి, విజయ్‌కుమార్, టీడీపీ నాయకులు గోపాల్‌నాయుడు, రాముడు పాల్గొన్నారు.

27 నుంచి 'అక్కినేని' శత జయంతి వేడుకలు

కర్నూలు(కల్చరల్), సెప్టెంబరు 24: నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ఈనెల 27 నుంచి 29 వరకు మూడు రోజులపాటూ దివంగత సినీ నటుడు అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 27న 'అక్కినేనికి నృత్య నీరాజనం' పేరుతో వేడుకలు ప్రారంభమవుతాయని, ఆయన నటించిన సినిమాల్లోని పాటలకు కళాకారులు నృత్యాలు చేస్తారని తెలిపారు. 28న 'ప్రేమ్‌నగర్' చిత్ర ప్రదర్శన కళాక్షేత్రంలో ఉంటుందని, 29న వేడుకల ముగింపు సందర్భంగా సంగీతం, నృత్యం, నాటకం విభాగాల్లో కృషి చేసిన కళాకారులకు సత్కారం ఉంటుందని తెలిపారు. అనంతరం ఎన్టీయార్ కృష్ణా జిల్లాకు చెందిన వెలగలేరు ఆర్ట్స్ థియేటర్స్ కళాకారులతో, అనేక పరిషత్తుల్లో బహుమతులు సాధించిన 'రాత' అనే నాటక ప్రదర్శన ఉంటుందని తెలిపారు.

అదనపు గదులు మంజూరు చేయండి

సి.బెళగల్, సెప్టెంబరు 24: మండలంలోని పోలకల్లు జడ్పీ ఉన్నత పాఠశాలకు అదనపు గదులు మంజూరు చేయాలని హెచ్ఎం రమాదేవి కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరికి వినతిపత్రం అందజేశారు. బుధవారం పోలకల్లు గ్రామంలో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్ర మానికి హాజరై ఎమ్మెల్యే జడ్పీ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. బాలికల కోసం మండలానికి బాలికల హాస్టల్, అదనపు గదులను మంజూరు చేయాలని ఎమ్మెల్యేను హెచ్ఎం కోరారు.

పారిశుధ్య పనుల పరిశీలన



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 24: నగరంలోని ఆర్ఎస్‌రోడ్డు, బంగారుపేట, మౌర్యఇన్ కూడలి, ఆనంద్ థియేటర్, పాతడంపింగ్ యార్డు తదితర ప్రాంతాలలో పారిశుధ్య పనులను మంగళవారం కమిషనర్ ఎస్. రవీంద్రబాబు అధికారులతో కలిసి పరిశీలించారు. పలు ప్రాంతాలలో మురుగు కాలువలపై అక్రమ నిర్మాణాలు ఉండటంతో వాటిని తొలగించాలని కమిషనర్ ఆదేశించారు. కాలువలకు అవసరమైన నిర్మాణాలు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆయన వెంట డీఈఈలు కృష్ణలత, నరేష్, ఏసీపీ రంగస్వామి ఉన్నారు.

'డ్రోన్ టెక్నాలజీతో రైతులకు సేవలందిస్తాం'



సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ హోదా ధ్రువీకరణ పత్రాలతో కేవీ సుబ్బారెడ్డి

కర్నూలు(కల్చరల్), సెప్టెంబరు 24: డ్రోన్ టెక్నాలజీతో రైతులకు సేవలు అందిస్తామని కేవీ సుబ్బారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల అధినేత డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం కళాశాలకు చెన్నైకి చెందిన గరుడ ఏరోస్పేస్ సంస్థ 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' హోదాను కల్పిస్తూ ఆ సంస్థ ప్రతి నిధులు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కేవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ తమ కళాశాలకు గరుడ సంస్థ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ హోదా ఇస్తూ, తమ భాగస్వామిగా చేసుకుంటూ ఒప్పందం చేసుకుందని అన్నారు. దీనివల్ల తమ కళాశాల విద్యార్థులకు 'డ్రోన్ టెక్నాలజీ' గురించి ఆ సంస్థవారు ప్రత్యేక శిక్షణలు ఇస్తారని తెలిపారు. దీంతోపాటూ సమీప ప్రాంత రైతులకు డ్రోన్ల ద్వారా వ్యవసాయంలో సాగు చేసేందుకు సహకారం అందిస్తారని వివరించారు.

రంగస్థల కళాకారుడి మృతి

కర్నూలు(కల్చరల్), సెప్టెంబరు 24: కర్నూలుకు చెందిన సీనియర్ రంగస్థల కళాకారుడు జీసీ సుబ్బారావు (68) మంగళవారం తెల్లవారు జామున మృతి చెందారు. సోమవారం రాత్రి ఒంట్లో నలతగా ఉన్నట్లు తెలిపిన ఆయన స్టాంటన్‌పురంలోని తన స్వగృహంలో మృతి చెందారు. ఆయన మరణంపై కర్నూలుకు చెందిన పలువురు కళాకారులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జీసీ సుబ్బారావు మృతి కళారంగానికి తీరని లోటని కళావాహిని సాహితీ సాంస్కృతిక సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం మనోహర్‌బాబు అన్నారు. స్టాంటన్‌పురంలోని ఆయన స్వగృహంలో జీసీ సుబ్బారావు పార్థివ దేహానికి మనోహర్‌బాబుతోపాటూ కళాకారులు భాస్కర్ యాదవ్, వినోద్‌కుమార్, లక్ష్మన్న, జేఎం రాజు, రాజశేఖర్ తదితరులు నివాళులర్పించారు.

హ్యాండ్‌బాల్, బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక

కర్నూలు(స్పోర్ట్స్), సెప్టెంబరు 24: బి.క్యాంపు క్రీడా మైదానంలో అండర్- 19 ఎస్‌జీఎఫ్ హ్యాండ్‌బాల్, బాస్కెట్‌బాల్ బాలబాలికల జట్లకు ఎంపికను మంగళవారం నిర్వహించారు. ఎస్‌జీఎఫ్ అండర్-19 ఆర్గనైజింగ్ సెక్రటరీ సి.హర్షవర్దన్, మాజీ ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బి.రామాంజనేయులుతో కలిసి పోటీలను ప్రారంభించారు. రాఘవేంద్ర,నరసయ్య, నవీన్ కుమార్, సులోచన, కిరణ్, భాస్కర్, రాజశేఖర్ పాల్గొన్నారు.

బోధనా మెలకువలు మెరుగుపరుచుకోవాలి

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 24: బోధనా మెలకువలు మరింత మెరుగుపరుచుకోవాలని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కే. చిట్టినరసమ్మ అన్నారు. మంగళవారం కాలేజీలోని మెడికల్ ఎడ్యుకేషన్ యూనిట్‌లో నేషనల్ మెడికల్ కమిషన్ గైడ్ లైన్స్ మేరకు ఎన్ఈయూ కోఆర్డినేటర్ డా.సింధియా శుభప్రద ఆధ్వర్యంలో వైద్యుల మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ ప్రారంభించారు. సూపరింటెండెంట్ సి.ప్రభా కర్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్స్ సాయి సుధీర్, విజయానందబాబు, పాల్గొన్నారు.

డ్రిప్ కోసం దరఖాస్తు చేసుకోండి

కల్లూరు, సెప్టెంబరు 24: బోరుబావులు ఉన్న రైతులు డ్రిప్ కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆత్మ పీడీ శ్రీలత సూచించారు. మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో లక్ష్మీపురంలో రైతులకు అవగాహన కల్పించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 12 కేసులు నమోదు

కర్నూలు, సెప్టెంబరు 24: నగరంలో ట్రాఫిక్ పోలీసులు మంగళవారం రాత్రి 12 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. స్థానిక సుంకేసుల రోడ్డులోని సంజీవని హాస్పిటల్ వద్ద ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేశారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 11 ద్విచక్ర వాహనదారులు, ఆటో డ్రైవరుపై కేసులు నమోదు చేశారు. వాహనాలను స్వాధీనం చేసుకుని వీరిని కోర్టులో హాజరు పరు స్తామని సీఐ తెలిపారు. ఈ తనిఖీలో ఎస్ఐ ఎర్రన్న, ఆర్ఎస్ఐ డి.అహ్మద్ హుసేన్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

దాడి కేసు నమోదు

కర్నూలు, సెప్టెంబరు 24: నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో శరీన్‌నగర్‌లో రాజు, ఆయన భార్య సార, తల్లిపైన దాడి కేసులు నమోదు చేశారు. శ్రీనివాసులు ఇంటి పక్కనే ఉన్న కట్టెలు విషయంలో జరిగిన గొడవ తీవ్రమై దాడికి పాల్పడటంతో శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు ఈ ముగ్గురిపై కేసు నమోదు చేశారు. అలాగే రాజు భార్య ఫిర్యాదు మేరకు శ్రీనివాసులుపై కేసు నమోదు చేశారు.

అక్రమాలపై విచారణ జరపాలి

కర్నూలు(రాజ్‌విహార్ సర్కిల్), సెప్టెంబరు 24: గత వైసీపీ ప్రభుత్వం హయాంలో టీటీడీలో జరిగిన అక్రమాలపై విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని జనసేన ఉమ్మడి జిల్లా కన్వీనర్ చింతా సురేష్ కోరారు. మంగళవారం క్రిష్ణానగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాన్ ప్రాయశ్చిత దీక్షకు మద్దతు తెలుపుతూ జనసేన పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చింతా సురేష్ మాట్లాడుతూ తిరుమల లడ్డూ ప్రసాదంలో జంతు కొవ్వులను వాడి అపవిత్రం చేసిన వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పీబీవీ సుబ్బయ్య, వీర మహిళలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ కౌలు రైతు మృతి

కర్నూలు, సెప్టెంబరు 24: తాలుకా పోలీస్ స్టేషన్ పరిధిలో నిడ్జూరు గ్రామానికి చెందిన లాలు బాషా అనే కౌలు రైతు ఆసుపత్రిలో చికిత్స పొం దుతూ మంగళవారం మృతి చెందాడు. ఈయన గ్రామంలో మూడెకరాల పొలాన్ని కౌలుకు తీసుకున్నాడు. అందులో పత్తి పంట వేయగా.. పంటలు మలచకపోవడం, సరైన ఉత్పత్తి రాకపోవడంతో నష్టం వచ్చింది. సుమారుగా గ్రామాల్లో లాలు బాషా రూ.లక్షల్లో అప్పులు చేసినట్లుగా సమాచారం. ఈ నెల 21న పొలంలో గడ్డి మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఇతనికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీధర్ తెలిపారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టండి: ఏవో



పత్తి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

ఓర్వకల్లు, సెప్టెంబరు 24: సాగు చేసిన పంటలపై రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి సుధాకర్ సూచించారు. మంగళవారం మండలంలోని హుశేనాపురం, ఉయ్యాలవాడ గ్రామాల్లో వ్యవసాయ శాఖ అనుబంధ సంస్థల ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్ర మం నిర్వహించారు. కంది, మొక్కజొన్న, పత్తి, పొగాకు తదితర పంటలను పరిశీలించారు. పత్తిలో గులాబి రంగు పురుగు, కందిలో మచ్చల పురుగు, పొగాకులో వైరస్, తెల్లదోమ అధికంగా ఉందని, వాటి నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. అలాగే ఉయ్యాలవాడ గ్రామంలో సీనియర్ టెక్నికల్ సహాయకుడు శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులు నూనె గింజల పంటల వైపు మొగ్గు చూపాలన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ అధికారి మదనగో పాల్, సర్పంచ్ చంద్రగోవర్ధనమ్మ, ఎంపీటీసీ చిన్నమ్మ, టెక్నికల్ ఏవో అల్లి పీరా, రైతులు, ఏవో, ఏఈవోలు పాల్గొన్నారు.

క్షేత్ర స్థాయి సమస్యలకు తక్షణమే పరిష్కారం

కోడుమూరు, సెప్టెంబరు 24: పొలం పిలుస్తోంది కార్యక్రమంతో రైతు క్షేత్ర స్థాయి సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపుతామని మండల వ్యవసాయ అధికారి రవిప్రకాష్ అన్నారు. కోడుమూరు సమీపంలోని జయన్న రైతు పొలంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో రైతు వేసిన పత్తి, వాము పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో అధిక ఉత్పత్తి, వ్యవసాయ అనుబంధ శాఖల పథకాలపై రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో రైతులు, డ్రిప్ ఇరిగేషన్ ఎంఐఏఓ సుధారాణి, రైతు సేవ కేంద్రం సిబ్బంది రసూల్, జయంత్, విజయశాంతి పాల్గొన్నారు.

వ్యవసాయ కార్యాలయాన్ని సందర్శించిన జిల్లా అధికారులు : మండల వ్యవసాయ కార్యాలయాన్ని జేడీఏ కృపాదాస్, జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, ఎమ్మిగనూరు ఏడీఏ ప్రవీణ్, ఖాద్రి, దస్తగిరి కోడుమూరు మండల సందర్శించారు. కోడుమూరులో చేపట్టిన పొలం పిలుస్తోంది, రైతులు వేసిన పంటల గురించి ఏవోను అడిగి తెలుసుకొన్నారు.

సి.బెళగల్: మండలంలోని చింతమానుపల్లె గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం చేపట్టిన పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంపీఈవోలు వెంకటేశ్, సిద్దు, ఈశ్వర్, రైతులు పాల్గొన్నారు.

సేవా దృక్పథం అలవర్చుకోవాలి

కర్నూలు(ఎడ్యుకేషన్), సెప్టెంబరు 24: విద్యార్థులు చదువుతోపాటు సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని ప్రిన్సిపాల్ ఎస్.నాగస్వామి నాయక్ అన్నారు. బి.క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో మంగళవారం ప్రిన్సిపాల్ అధ్యక్షతన ఎన్ఎస్ఎస్ దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రిటైర్డు ఇంగ్లీషు లెక్చరర్ హుస్సేన్ పీరన్ ప్రసంగిస్తూ ప్రతి ఒక్కరూ సమాజానికి తమ వంతు సేవ చేయాలన్నారు. అధ్యాపకులు రామకృష్ణ, విజయశేఖర్, మల్లికార్జున, సోమేష్, ఉల్గోజిరావు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

షోకాజ్ నోటీసులు సరికాదు: ఆప్టా

కర్నూలు(ఎడ్యుకేషన్), సెప్టెంబరు 24: జిల్లాలో 134 మందికి ఫేషియల్ హాజరు వేయనందుకు షోకాజ్ నోటీసులు ఇవ్వడం సరికాదని ఆప్టా కర్నూలు జిల్లా అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సేవాలాల్ నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చాలా మంది ఉపాధ్యాయులు సెలవులను అప్లయ్ చేసి ఉన్నారని, కాకపోతే డీడీవోలు ఇన్ టైమ్‌లో యాప్‌లో అప్‌లోడు చేయకపోవడం వలన నోటీసులు జారీ చేశారన్నారు. మండల విద్యాశాఖ అధికారులు లీవ్ రద్దు, అప్రూవ్ ఇన్‌టైమ్‌లో చేయాలన్నారు. అప్రూవ్ లేట్ చేస్తే అది ఉపాధ్యాయుల తప్పు ఎలా అవుతుందన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఈ విషయాన్ని గమనించి ఆలస్యంగా మంజూరు చేసిన అధికారులకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని తెలిపారు.

భగవద్గీత పుస్తకాల ఆవిష్కరణ

కర్నూలు(కల్చరల్), సెప్టెంబరు 24: సమస్త మానవజాతికి జీవన సారాన్ని బోధించిన గొప్ప గ్రంథం భగవద్గీత అని విశ్రాంత ఎస్పీ వెంకటేశం అన్నారు. మంగళవారం సాయంత్రం నగరంలోని 48 వార్డు రోజా వీధిలో సామాజిక సేవకురాలు మీసాల సుమలత ఏర్పాటు చేసిన భగవద్గీత పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. స్థానికులకు ఆయన భగవద్గీత పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో తరణి, విశ్వాభిరామ్, శేషమ్మ, పార్వతమ్మ, నారాయణమ్మ, ఆంజనేయులు, నాగప్ప పాల్గొన్నారు.

జడ్పీలో బదిలీల చిచ్చు



- మంత్రులు, ఎమ్మెల్యేల సిఫారసులపై భిన్నాభిప్రాయాలు
- చైర్మన్, సీఈవో మధ్య పెరిగిన దూరం

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 24: జిల్లా పరిషత్‌లో బదిలీల చిచ్చు రగిలింది. జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, సీఈవో జి.నాసరరెడ్డి మధ్య దూరం పెరిగినట్లు తెలుస్తోంది. ప్రధానంగా జిల్లా పరిషత్ పరిధిలో పని చేస్తున్న ఎంపీడీవోలు-42 మంది, పరిపాలన అధికారులు-22 వివిధ విభాగాలు, పాఠశాలల్లో పని చేస్తున్న సీనియర్ అసిస్టెంట్లు 33, జూనియర్ అసిస్టెంట్లు-45, టైపిస్టులు-12, రికార్డు అసిస్టెంట్లు-27 ల్యాబ్ అసిస్టెంట్లు-11, లైబ్రరీ అసిస్టెంట్లు-12, నాల్గవ తరగతి ఉద్యోగులు-5 మందికి సంబంధించి బదిలీల ప్రక్రియ నిర్వహించాలి. ఈ క్రమంలో ఒక్క ఎంపీడీవోల బదిలీలు తప్ప మిగిలినవన్నీ సజావుగా నిర్వహించారు.

మంత్రులు, ఎమ్మెల్యేల సిఫారసులపై భిన్నాభిప్రాయాలు

ఎంపీడీవోల విషయంలో మంత్రులు, ఎమ్మెల్యేలు నుంచి వచ్చిన సిఫారసులపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రధానంగా ఈ నెల 22 లోపల బదిలీ ప్రక్రియ పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈక్రమంలో ఆదివారం రాత్రికే బదిలీల ప్రక్రియ పూర్తి చేశారు. అయితే ఎంపీడీవోల బదిలీల విషయంలో వివిధ రకాల సమస్యలను చైర్మన్, సీఈవో ఎదుర్కొన్నారు. ముఖ్యంగా కొందరు ఎమ్మెల్యేలు, మంత్రుల నుంచి వచ్చిన సిఫారసులను చైర్మన్ బుట్టదాఖలు చేసి తనకు నచ్చిన వారిని నియమించారని కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అయితే మంత్రులు, ఎమ్మెల్యే సిఫారసులను తప్పకుండా పాటించాలని సీఈవో పట్టుబట్టారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య బేధాభిప్రాయాలు వచ్చాయి. ఈ క్రమంలో ఎంపీడీలకు సంబంధించి చైర్మన్ ఒక జాబితాను విడుదల చేశారు. చైర్మన్ విడుదల చేసిన జాబితాలో సీఈవో 9 మంది ఎండీవోల పేర్లు మార్చి ప్రొసీడింగ్స్ సిద్ధం చేశారు. దీంతో పాటు చైర్మన్ జాబితాలో ఎంపీడీవోల సంఖ్య 40 ఉంటే సీఈవో విడుదల చేసిన జాబితాలో 42కి వచ్చింది. దీంతో ఇద్దరి మధ్య అగాథం పెరిగింది.



నోట్ అప్రూవల్ లేకుండా జాబితా విడుదల

చైర్మన్ నోట్ అప్రూవల్ లేకుండా సీఈవో ఎంపీడీవోల జాబితాలు ఎలా విడుదల చేస్తారని చైర్మన్ అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. అయితే కొందరు మంత్రులు, ఎమ్మెల్యేల సిఫారసుల ప్రకారమే తాను జాబితాలు విడుదల చేసినట్లు సీఈవో వివరించారు. ఈ క్రమంలో ఎవ్వరికి వారే యమునా తీరంగా జాబితాలు విడుదల చేశారు. ఇప్పటికే ఈ జాబితాలు సంబంధిత శాఖ ఉద్యోగుల వాట్సాప్ గ్రూపులలో చక్కర్లు కొడుతున్నాయి. ప్రధానంగా బనగానపల్లె నియోజకవర్గంలోని మండలాలకు సంబంధించి చైర్మన్ తాను అనుకున్న వారికే పోస్టింగ్‌లు ఇవ్వాలని పట్టుదలతో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే రాష్ట్ర రోడ్ల భవనాల శాఖ మంత్రి కూడా తాను సూచించిన వారికే ఇవ్వాలని లేఖలు ఇచ్చినట్లు తెలిసింది. ఇద్దరి మధ్య గతంలో నుంచే వైరం ఉండటంతో మధ్యలో అధికారులు సతమతమవుతున్నారు.

జిల్లా పరిశ్రమల శాఖలో బదిలీలు

కర్నూలు(రాజ్‌విహార్ సర్కిల్), సెప్టెంబరు 24: జిల్లా పరిశ్రమల శాఖలో సాధారణ బదిలీల్లో భాగంగా జనరల్ మేనేజర్ ఎస్‌సీఆర్‌సీఎం ప్రసాద్ బదిలీ అయ్యారు. ఆయన నెల్లూరు జిల్లాకు బదిలీ కాగా, ఆయన స్థానంలో నెల్లూరు జిల్లా పరిశ్రమలశాఖ జీఎం హరిప్రసాద్ కర్నూలుకు బదిలీపై రానున్నారు. ఇదే కార్యాలయంలో ఉప సంచాలకుడిగా పని చేస్తున్న రమణారెడ్డిని ప్రధాన కార్యాలయానికి బదిలీ చేయగా, ఆయన స్థానంలో డీడీగా అరుణ ఏలూరు నుంచి ఇక్కడికి రానున్నారు. ఏడీగా విధులు నిర్వర్తిస్తున్న వెంకటరెడ్డిని చిత్తూరు జిల్లాకు, ఐపీవో శివప్రసాద్‌ను నంద్యాల జిల్లాకు బదిలీ చేశారు. నంద్యాల నుంచి డానియేలు కర్నూలుకు బదిలీపై రానున్నారు.

కాలుష్య నియంత్రణ మండలిలో..

కాలుష్య నియంత్రణ మండలి ఈఈ మునిప్రసాద్ అనంతపురం జిల్లాకు బదిలీ కాగా, ఆయన స్థానంలో కిషోర్‌రెడ్డి కర్నూలు ఈఈగా బదిలీపై వస్తున్నారు. ఖాళీగా ఉన్న పర్యవేక్షక ఇంజనీరు స్థానానికి శంకర్‌నాయక్ బదిలీపై రానున్నారు.

శ్రీమఠం హుండీ ఆదాయం రూ.2.95 కోట్లు



హుండీ లెక్కింపును పరిశీలిస్తున్న దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు

మంత్రాలయం, సెప్టెంబరు 24: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠం హుండీ ఆదాయం రూ.2,94,57,810 నగదు వచ్చినట్లు మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు వెంకటేష్ జోషి, శ్రీపతి ఆచార్, ఐపీ నరహింహమూర్తి తెలిపారు. ఆగస్టు 5 రోజులతో పాటు సెప్టెంబరు 23 రోజులకు సంబంధించిన 28 రోజుల హుండీని మఠం గురురాజాంగణ భవనంలో మంగళవారం దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శ్రీమఠంలోని 24 హుండీలను లెక్కించినట్లు తెలిపారు. నగదుతో పాటు 1.240 కేజీల వెండి, 70.500 గ్రాములు బంగారు, వివిధ దేశాల డాలర్లు వచ్చినట్లు చెప్పారు. ఈ హుండీ లెక్కింపులో సూపరింటెండెంట్లు అనంత పురాణిక్, రవి కులకర్ణి, ఆడిటర్ దత్తుస్వామి, కృష్ణమూర్తి, గిరిధర్, సుజ్ఞానేంద్ర, సంప్రీతి మోహన్, లక్ష్మీకాంత్, గురురాజ్ పాల్గొన్నారు.

నవోదయ ప్రవేశ పరీక్ష దరఖాస్తుకు గడువు పొడిగింపు

ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు 24: మండలంలోని బనవాసి నవోదయ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశ పరీక్ష కోసం దరఖాస్తు చేసుకోవడానికి గడువు పొడిగించినట్లు విద్యాలయం ప్రిన్సిపాల్ పద్మావతి తెలిపారు. ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం ఈనెల 23వ తేదీ వరకు మొదటగా గడువు ఇచ్చిందని చెప్పారు. అయితే మళ్లీ ప్రభుత్వం అక్టోబరు 7వ తేదీ వరకు గడువు పొడగించిందని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రేమ వివాహం



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో యువతికి తాళి కడుతున్న యువకుడు

ఆదోని రూరల్, సెప్టెంబరు 24: ఆలూరుకు చెందిన ప్రేమ జంట పోలీసులు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అధికారుల సాక్షిగా ఒక్కటైంది. ఆలూరుకు చెందిన సోడాల హోటల్ ఈరన్న, అంజినమ్మ దంపతుల కుమారుడు వాల్మీకి సోడాల ఉరుకుంద, దళిత సామాజిక వర్గానికి చెందిన బెళ్గిగుండు, అళ్లమ్మ దంపతుల కుమార్తె మునీంద్రమ్మ నాలుగేళ్లగా ప్రేమించుకుంటున్నారు. అయితే కులాంతర వివాహం చేయడానికి యువకుడి తల్లిదండ్రులు ఒప్పుకోలేదు. దీంతో పంచాయితీ ఆలూరు పోలీస్ స్టేషన్‌కు చేరింది. దీంతో ఎట్టకేలకు ప్రేమికుడు దిగి వచ్చి పెళ్లికి ఒప్పుకోవడంతో పోలీసులు, యువతి తరపున బంధువులు మంగళవారం ఆదోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చి ప్రేమికులకు సబ్ రిజిస్ట్రార్ రాజశేఖర్ సమక్షంలో రిజిస్టర్ పెళ్లి చేశారు. కార్యక్రమంలో దళిత నాయకులు మాజీ ఎంపీటీసీ నరసప్ప, త్యాగయ్య, గోవిందు, రామాంజనేయులు, వీరేష్, జగన్, మారెప్ప, తదితరులు పాల్గొన్నారు.

స్వార్థ రాజకీయాల కోసమే

తిరుమల లడ్డూ వివాదం : వైసీపీ



గోనెగండ్లలో మాట్లాడుతున్న వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి

గోనెగండ్ల, సెప్టెంబరు 24: తిరుపతి లడ్డూల వివాదాన్ని సీఎం చంద్రబాబునాయుడు స్వార్థ రాజకీయాల కోసం వాడుకొని ప్రజలను తప్పుదోవ పట్టించారని వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం గోనెగండ్లలోని చింతలాముని నల్లారెడ్డి స్వామిని దశమి సందర్భంగా ఆయన దర్శించుకొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎస్వీ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పథకాల్లో ఒక్కటి కూడా ఇంత వరకు అమలు చేయలేదన్నారు. ప్రజలలో తనపై రోజురోజుకూ వ్యతిరేకత పెరుగుతుండంతో తిరుపతి లడ్డూ వివాదాన్ని తీసుకొచ్చారని అన్నారు. ఆయనతోపాటు కూడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, బుట్టా శివనీలకంఠ తదితరులు పాల్గొన్నారు.

'అక్రమాలకు పాల్పడితే చర్యలు'



వేరుశనగకాయల తూకాన్ని పరిశీలిస్తున్న సెక్రటరీ జయలక్ష్మి

కర్నూలు(అగ్రికల్చర్), సెప్టెంబరు 24: కర్నూలు మార్కెట్ యార్డులో తమకు గిట్టుబాటు ధర అందుతుందని రాష్ట్రంలోని వివిధ జిల్లాలతో పాటు పక్క రాష్ట్రాల నుంచి కూడా రైతులు పంట ఉత్పత్తులను తీసుకువస్తున్నారని, అక్రమాలకు పాల్పడి వారిని నష్టపరిస్తే చర్యలు తీసుకుంటామని కర్నూలు మార్కెట్ కమిటి సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి హెచ్చరించారు. మంగళవారం మార్కెట్ యార్డులో పంట ఉత్పత్తులను తూకం వేసే సమయంలో సెక్రటరీ జయలక్ష్మి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులు తెచ్చిన వేరుశనగ కాయలను ఎలక్ట్రానిక్ కాటాపై తూకం వేసే సమయంలో పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ రైతులకు న్యాయం జరగాలని, లేకపోతే ఎట్టి పరిస్థితుల్లోనూ క్షమించేది లేదని అన్నారు. లైసెన్సులు రద్దు కూడా చేస్తామని హెచ్చరించారు. కమీషన్ ఏజెంట్లు కాటా వేసే సమయంలో తప్పనిసరిగా అదనపు సెక్రటరీలు సూపర్‌వైజర్లు నిఘా ఉంచాలని, అక్కడే ఉండి పర్యవేక్షించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు సెక్రటరీలు వెంకటేశ్, సూపర్‌వైజర్లు కేశవరెడ్డి, శివన్న, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రసీదులు ఇవ్వాలి

రైతులు కర్నూలు మార్కెట్ యార్డుకు పంట ఉత్పత్తులు తీసుకువచ్చి కమీషన్ ఏజెంట్లకు విక్రయిస్తున్నారని, ఈ విషయంలో ఎటువంటి పొరపాట్లు లేకుండా రైతులకు కంప్యూటర్ రసీదులు అందజేయాలని మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి కంప్యూటర్ ఆపరేటర్లను ఆదేశించారు. మంగళవారం యార్డులో కంప్యూటర్ గదిలో ఆకస్మిక తనిఖీలు చేసిన సెక్రటరీ సిబ్బందికి పలు సూచనలు చేశారు.

మహానంది ఆలయ ఈవోగా నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి



మహానంది, సెప్టెంబరు 24: మహానంది ఆలయ ఈవోగా నల్లకాల్వ శ్రీనివాసరెడ్డిని నియమిస్తూ రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ మంగళవారం ఆదేశాలు జారీ చేసారు. గతంలో నరసరావుపేట కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి ఆలయ రెగ్యులర్ ఈవోతో పాటు మహానంది దేవస్థానం ఇన్‌చార్జి ఈవోగా నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి కొనసాగారు. అయితే ఇటీవల రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాల ఈవోల బదిలీల్లో భాగంగా దేవదాయశాఖ కమిషనర్ మహానంది దేవస్థానానికి రెగ్యులర్ ఈవోగా రాష్ట్ర దేవదాయశాఖ ప్రధాన కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న శోభారాణిని మహానంది ఈవోగా బదిలీ చేసారు. అయితే ఆ ఉత్తర్వులు ఒక్క రోజుల్లోనే రద్దు చేసి ఆమెను విశాఖ పట్టణంలోని కనక మహాలక్ష్మి దేవస్థానానికి బదిలీ చేస్తూ కమిషనర్ ఆదేశాలు జారీ చేసారు. తిరిగి గతంలో మహానంది ఆలయ ఇన్‌చార్జి ఈవోగా కొనసాగిన శ్రీనివాసరెడ్డిని పూర్తి స్థాయి బాధ్యతలతో తిరిగి మహానంది దేవస్థానానికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసారు. దీంతో పాటు గుంటూరు జిల్లా పొన్నూరు ఆంజనేయ స్వామి ఆలయానికి ఈవోగా నల్లకాల్వ శ్రీనివాసరెడ్డిని కమిషనర్ నియమించారు. మరో రెండు రోజుల్లో మహానంది ఆలయ ఈవోగా ఆయన బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది.

బీఈడీ 4వ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 24: బీఈడీ 4వ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయని పరీక్షల విభాగం కంట్రోలర్ ఎన్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలోని 4 సెంటర్లలో నిర్వహించిన పరీక్షలకు 3231 మంది దరఖాస్తు చేసుకోగా 3091 మంది హాజరయి పరీక్షలు రాశారని తెలిపారు.

స్టైఫండ్ నిర్ణయంపై న్యాయవాదుల హర్షం



సీఎం చంద్రబాబు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న న్యాయవాదులు

కర్నూలు(లీగల్), సెప్టెంబరు 24: రాష్ట్రంలోని జూనియర్ న్యాయవాదులకు ప్రతి నెలా స్టైఫండ్ ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం పట్ల కర్నూలు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేస్తూ క్షీరాభిషేకం చేశారు. ప్రతి జూనియర్ న్యాయవాదికి నెలకు రూ.10వేలు స్టైఫండ్ ఇవ్వడానికి సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమరావతిలో జరిగిన న్యాయ సమీక్షలో నిర్ణయం తీసుకున్నారు. కర్నూలు జిల్లా టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు కేఈ జగదీష్ మాట్లాడుతూ రాష్ట్రంలో న్యాయవాదుల సంక్షేమం పట్ల కృషి చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. కర్నూలు జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి. కృష్ణమూర్తి ఆధ్వర్యంలో స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జూనియర్ న్యాయవాదులు తమ వృత్తిలో స్థిరపడేవరకు స్టయిఫండ్ ఇవ్వడం శుభపరిణామమని అన్నారు.

పొగాకు సెజేషన్ కేంద్రాల ప్రారంభం

కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 24: కేంద్ర ప్రభుత్వ కుటుంబ ఆరోగ్య సంక్షేమ శాఖ పిలుపు మేరకు దేశ వ్యాప్తంగా పొగాకు సెజేషన్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.కె.చిట్టినరసమ్మ తెలిపారు. ఈ మేరకు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలోని సైక్రియాట్రి, స్టేట్ కేన్సర్ సెంటర్ ఆధ్వర్యంలో రెండు పొగాకు సెజేషన్(మాన్పించు) కేంద్రాలను ప్రిన్సిపాల్ ప్రారంభించారు. పొగాకు బారిన పడిన వారికి ఈ కేంద్రాలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో మానసిక వ్యాధుల విభాగం హెచ్‌వోడీ డా.ఎన్.నాగేశ్వరరావు, స్టేట్ కేన్సర్ హాస్పిటల్ డైరెక్టర్ డా.సీఎస్‌కే ప్రకాష్ టొబాకో కంట్రోల్ ప్రోగ్రాం కాలజిస్టు డా.చంద్రశేఖర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ గంగాధర్ నాయక్, హేమంత్ పాల్గొన్నారు.

ఇసుక రీచ్‌ల తనిఖీ



ఇసుక రీచ్‌ను తనిఖీ చేస్తున్న సాంకేతిక నిపుణులు

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 24: డీఆర్‌డీవో సాంకేతిక నిపుణులు జిల్లాలోని ఇసుక రీచ్‌ల్లో తనిఖీలు చేశారని గనులశాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. జిల్లాలోని ఇసుక తవ్వకాలు, రవాణా తదితర అంశాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవడానికి అవసరమైన సాంకేతిక కెమెరాల ఏర్పాటు ప్రక్రియకు అవసరమైన తనిఖీలు చేశారు. డీడీ మాట్లాడుతూ ఇసుక ప్రతి రోజు ఏ రీచ్‌లో ఎంత పరిమాణంలో తవ్వకాలు జరుగుతాయి? ఎంత అమ్మకాలు జరుగుతాయి? అని కొలిచే లేటెస్టు టెక్నాలజీతో కూడిన సాంకేతిక కెమెరాలు అమర్చేందుకు అవసరమైన ప్రక్రియలో భాగంగా సి.బెళగల్ మండలం సింగవరం స్టాక్ పాయింట్‌ను పరిశీలించామని చెప్పారు. దాదాపు ఇసుక రీచ్‌ల్లో వీటిని అమర్చి ఇసుక పాలసీలో లోపాలు లేకుండా పకడ్బందీ చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

భారీ వర్షం.. తీవ్ర నష్టం

- గాలివాన ఉధృతికి కొట్టుకుపోయిన గడ్డివాములు
- కూలిపోయిన పరిశ్రమల రేకుల షెడ్లు
- వక్కేరు వాగుకు భారీగా వరద

కర్నూలు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా అంతటా సోమవారం రాత్రి కురిసిన వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోయారు. కర్నూలు రూరల్ మండలం పరిధిలో పలు గ్రామాల్లో తీవ్ర నష్టం పరిగింది. గొందిపర్ల, ఈ.తాండ్రపాడు గ్రామాల్లో భారీ వర్షాలకు అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారు. పాడిగేదెల కోసం ఏర్పాటు చేసుకున్న షెడ్లు, గడ్డివాములు గాలివాన ఉధృతికి కొట్టుకుపోయాయి. పశుగ్రాసం లేక మూగజీవాలను పస్తులు పెట్టాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాదు.. ఆ ప్రాంతంలో ఉన్న వివిధ పరిశ్రమల (ఫ్యాక్టరీలు)కు చెందిన రేకుల షెడ్లు గాలివాన బీభత్సానికి కుప్పకూలిపోయాయి. కల్లూరు మండలం పెద్దపాడు, ఎ.గోకులపాడు, నెరవాడ, సల్కాపురం, పర్ల, గూడూరు మండలం కె.నాగులాపురం తదితర గ్రామాల్లో భారీ వర్షాలు పడ్డాయి. నల్లరేగడి నేల పొలాలు తడిసిముద్దవడంతో పనుల కోసం రైతులు పొలాల్లోకి వెళ్లలేని దుస్థితి నెలకొంది. లోతట్టు పొలాల్లో పంటలు నీటమునిగాయి. వక్కేరు వాగుకు వరద రావడంతో పలు గ్రామాలకు రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. జిల్లాలో మంగళవారం సగటున 17.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదయింది. అత్యధికంగా నందవరం మండలంలో 96 మిల్లీ మీటర్లు, కల్లూరు మండలంలో 53.8, మంత్రాలయం మండలంలో 47.4, ఎమ్మిగనూరు మండలంలో 44.2, కర్నూలు రూరల్ మండలంలో 36.2, కర్నూలు అర్బన్ మండలంలో 35.4, గోనెగండ్ల మండలంలో 34.4, గూడూరు మండలంలో 22.6, వెల్దుర్తి మండలంలో 17.2, కోడుమూరు మండలంలో 14.8, కోసిగి మండలంలో 14.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు చేసుకుంది. సెప్టెంబరు నెలలో సాధారణ వర్షపాతం 93.2 మిల్లీ మీటర్లు కాగా.. ఇప్పటి వరకు 82.3 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని అధికారులు వెల్లడించారు.

అప్పు తీర్చలేక వ్యక్తి ఆత్మహత్య

గోనెగండ్ల, సెప్టెంబరు 24: ఇల్లు కట్టుకోడానికి రూ. 8 లక్షలు అప్పుచేసి, తీర్చలేక తీవ్ర మానసిక వ్యథకు గురైన బోయ సీతారాముడు(32) ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండల పరిధిలోని పెద్దమరివీడు గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. నందవరం మండలం కనకవీడు పేట గ్రామానికి చెందిన బోయ సీతారాముడుకు ఆరేళ్ల క్రితం పెద్దమరివీడు గ్రామానికి చెందిన మునీంద్రమ్మతో పెళ్లి జరిగింది. వీరి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇరువురు కూలీ పని చేసి జీవనం సాగించేవారు. వీరు రూ. 8 లక్షలు అప్పుచేసి కనవీడు పేటలో ఇల్లు కట్టుకున్నారు. ఈ అప్పును ఎలా తీర్చాలో తెలియక సీతారాముడు పార్లపల్లి రస్తాలో ఇషాక్ పొలం దగ్గర తుమ్మ చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి లచ్చప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గంగాధర్ తెలిపారు.

టపాసుల విక్రయ లైసెన్స్‌కు దరఖాస్తుల స్వీకరణ

కర్నూలు(రూరల్)సెప్టెంబరు24: దీపావళి పండుగను పురస్కరించుకొని టపాసుల విక్రయానికి తాత్కాలిక లైసెన్స్‌లు పొందడానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కర్నూలు ఆర్డీవో శేషిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తలైసెన్స్ ఫారం ఎల్‌ఈ-5 కోసం తహసీల్దార్ ద్వారా ఫారం ఏఈ-5లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన స్టాల్స్ నిర్వాహకులకు సూచించారు. గతేడాది ఎల్‌ఈ-5 లైసెన్స్‌లు పొందిన వారు తదుపరి రెన్యువల్ కోసం ఆర్‌ఈ-1లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

డాక్టర్ రాయపాటి శ్రీనివాస్‌కు అంతర్జాతీయ అవార్డు



కర్నూలు(కల్చరల్), సెప్టెంబరు 24: కర్నూలుకు చెందిన లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ ప్రతినిధి, నైస్ యూత్ ఫర్ కల్చర్ అండ్ ఎడ్యుకేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్‌కు సౌత్ అమెరికాకు చెందిన ఈక్వెడార్ దేశం నుంచి మంగళవారం ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ హ్యూమన్ రైట్స్ అండ్ పీస్ జస్టిస్ అంతర్జాతీయ సంస్థ నుంచి అవార్డు లభించింది. డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ లయన్స్ క్లబ్‌తోపాటు వివిధ జాతీయ, అంతర్జాతీయ సంస్థల సహకారంతో చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించిన ఈ సంస్థ అంతర్జాతీయ డైరెక్టర్ ప్రిన్స్, అంబాసిడర్ డాక్టర్ ఇస్మాయిల్ ప్రాంకో అంతర్జాలం ద్వారా ఈ అంతర్జాతీయ స్థాయి ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

గ్రామసభలు నిర్వహించాలి

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 24: స్వర్ణాంధ్ర-2047 విజన్ ప్రణాళిక రూపకల్పనలో భాగంగా ప్రతి గ్రామ పంచాయతీలో గ్రామ సభలు నిర్వహించాలని కలెక్టర్ పి. రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్ రూపకల్పన, ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాల నిర్వహణపై కలెక్టర్ జిల్లా, మండల స్థాయి అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటింటికి వెళ్లి విజన్ డాక్యుమెంట్ అందించి, ప్రజలు రైతులు, విద్యార్థులు తదితర అన్ని వర్గాల నుంచి తమ స్మార్ట్ ఫోన్ ద్వారా క్యూఆర్ కోడ్ స్కాన్ చేయించి వారి అభిప్రాయాలను పొందుపరిచేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోలను ఆదేశించారు. ఇప్పటి వరకు జిల్లాలో 426 గ్రామసభలు నిర్వహించామని, ఇందులో 90వేల మంది ప్రజలు పాల్గొన్నారని అన్నారు.

బదిలీలలు

- జాబితాలో మళ్లీ సవరణ?
- రెవెన్యూ ఉద్యోగుల బదిలీల్లో అనుమానాలు

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 24: సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఘన విజయం సాధించింది. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక తొలిసారిగా కొన్ని ఉద్యోగుల బదిలీలకు పచ్చజెండా ఊపింది. అందులో భాగంగా రెవెన్యూ శాఖలో జిల్లాలోని కొందరు 250 మంది వీఆర్వోలు, 10 మంది తహసీల్దార్లు, 30మంది ఆర్‌ఐలు, జూనియర్ అసిస్టెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులు సుమారుగా ఒక వంద మంది బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు. బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలని కూటమి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ ఆదేశాలకు విరుద్ధంగా కలెక్టర్ కార్యాలయంలోని డీఆర్వో సిబ్బంది, రెవెన్యూ బదిలీలలో కొందరు అవినీతి అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బదిలీలకు దరఖాస్తు చేసుకున్న రెవెన్యూ ఉద్యోగులకు రెండు రోజుల క్రితం ఆర్డర్స్ ఇచ్చారు. కానీ కలెక్టర్ ఆదేశాలను బేఖాతర్ చేస్తూ వీఆర్వో ఆర్‌ఐ, తహసీల్దార్ల బదిలీలను డీఆర్వో కార్యాలయ సిబ్బంది మార్పులు, చేర్పులు చేస్తున్నట్లు సమాచారం. గతంలో వెల్దుర్తి తహసీల్దార్ కార్యాలయంలో పని చేసిన ఒక ఉన్నతాధికారి, ఓర్వకల్లులో పని చేసిన ఒక ఆర్‌ఐ, మరొక అధికారి బదిలీల్లో మార్పులు చేర్పుల్లో కీలక సూత్రదారులుగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. మార్పులు, చేర్పుల్లో భాగంగా కర్నూలు, కల్లూరు మండలాల్లో ఒక స్థానం కోసం రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు వసూలు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలను బేఖాతరు చేస్తూ మార్పులు, చేర్పుల బదిలీలను డీఆర్వో సిబ్బంది ఇప్పటికే సిద్ధం చేసినట్లు సమాచారం.

కుర్చీ వదలని రెవెన్యూ సిబ్బంది

డీఆర్వో కార్యాలయంలో పని చేస్తున్న కొందరు సిబ్బంది 10 నుంచి 20 సంవత్సరాల నుంచి తిష్ట వేశారు. సాధారణ బదిలీల్లో బాగంగా వివిధ మండలాలకు అధికారులు బదిలీ అయినా డిప్యుటేషన్‌పై డీఆర్వో కార్యాలయంలో ప్రస్తుతం కొనసాగుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో డీఆర్వో కార్యాలయంలోని ప్రతి సెక్షన్‌లో ఒక్కో ఫైలుకు ఒక్కో రేటు నిర్ణయించారు. ఇప్పుడు జరుగుతున్న బదిలీల్లో వైసీపీతో అంటకాగిన ఉద్యోగులే మళ్లీ పెత్తనం చెలాయిస్తున్నారు. డీఆర్వో కార్యాలయంలోని కొందరు అధికారులు అప్పట్లో వైసీపీ ఏజెంట్లుగానూ పనిచేశారు. మళ్లీ ఇప్పుడు వారే బదిలీల్లో పైరవీలకు పాల్పడుతున్నట్లు సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో అలాంటి వారిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

గత ఐదేళ్లలో దుర్మార్గ పాలన

- ఎంపీ బస్తిపాటి నాగరాజు
- ఇది మంచి ప్రభుత్వం, పొలం పిలుస్తోందిలో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యేలు బీవీ, కేఈ


చిలకలడోనలో మాట్లాడుతున్న ఎంపీ నాగరాజు


నందవరం: శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బీవీ

మంత్రాలయం, సెప్టెంబరు 23: గత ఐదేళ్లలో దుర్మార్గ పాలన సాగిందని ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. మంగళవారం మండలంలోని చిలకలడోన గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రతి పనికి, కరపత్రానికి జగన్ బొమ్మతో ప్రభుత్వ ఖజానా వైసీపీ లూటి చేసిందన్నారు. కూటమి శ్రేణులు అధికారులు సహకరించాలని టీడీపీ నాయకులు రాఘవేంద్ర రెడ్డి కోరారు. జనసేన ఇన్‌చార్జ్ బి.లక్ష్మన్న, మాజీ జడ్పీటీసీ లక్ష్మయ్య, జిల్లా అధికార ప్రతినిధి చావిడి వెంకటేశ్, హనుమంతు, మాదప్ప, జనసేన నాయకులు యేసేపు, మద్దిలేటి, పవన్ కుమార్ రెడ్డి, గోపాల్, వీరేష్, ఎంపీటీసీ మేకల వెంకటేశ్, చాపల నాగేష్, మల్లేష్, రాగన్న, హుశేనీ, విష్ణువర్ధన్ రెడ్డి, ప్రత్యేధికారి నారాయణస్వామి పాల్గొన్నారు.

నియోజకవర్గంలో రైతులకు అండగా ఉండాలని వ్యవసాయాధికారులకు ఎంపీ సూచించారు. ఘవేంద్రరెడ్డి అన్నారు. మాధవరంలో మంత్రాలయం, పెద్దకడుబూరు, కోసిగి, కౌతాళం ఏవోలు జీరగణేష్, ప్రసాద్, రాజు, శేషాద్రి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రఘునాథరెడ్డి, రామకృష్ణ రెడ్డి, మాజీ ఎంపీటీసీ లక్ష్మయ్య, విష్ణువర్ధన్ రెడ్డి, మద్దిలేటి, లక్ష్మన్న, ఉరుకుందు, మహ్మద్ రఫీ, రాఘవేంద్ర పాల్గొన్నారు.

నందవరం: ఇచ్చిన హామీలను సీఎం చంద్రబాబు దశలవారీగా అమలు చేస్తున్నారని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి అన్నారు. మంగళవారం మండంలో ఇది మంచిప్రభుత్వం, పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో పాల్గొన్నారు. బీసీ కాలనీలో సీసీ రోడ్డు పనులు, రూ.1.15కోట్లతో జల్‌జీవన్ మిషన్‌లో ఇంటింటికి కోళాయి పైలాన్‌కు ఆవిష్కరించారు. టీడీపీ నాయకుడు దేశాయి మాధవరావు, పుష్పావతి, బండేగురుస్వామి, గురురాజారావు, ఖాసింవలి, దర్మాపురం గోపాల్, నారాయణరెడ్డి, ఈరన్నగౌడ్, డీవీ రాముడు పాల్గొన్నారు. అనంతరం ముగతి గ్రామం పొలం పిలుస్తుందిలో మాట్లాడుతూ ఆర్డీఎస్ ద్వారా ప్రతి ఎకరాకు సాగునీరందిస్తామన్నారు. నారాయణరెడ్డి, బండేగురుస్వామి, లచ్చప్పనాయుడు, జబ్బార్ పాల్గొన్నారు.

పత్తికొండ: వెనుకబడ్డ పత్తికొండ ప్రాంతానికి హంద్రీనీవా నీరివ్వడమే లక్ష్యమని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. పొలం పిలుస్తోందిలో భాగంగా వేరుశనగ పంటను పరిశీలించి రైతుతో మాట్లాడారు. టీడీపి నాయకుడు సాంబశివారెడ్డి, ఏడీఏ మోహన విజయ్‌కుమార్, ఏవో వెంకటరాముడు, ఉద్యాన అధికారి దస్తగిరి పాల్గొన్నారు. క్రీడల్లో పత్తికొండ పేరును రాష్ట్రస్థాయికి తీసుకెళ్లేలా ప్రతిభ చూపాలని ఎమ్మెల్యే శ్యాంబాబు విద్యార్థులకు సూచించారు. క్రీడామైదానంలో మంగళ వారం నియోజ కవర్గస్థాయి క్రీడలను ప్రారంభించారు. డీఎస్పీ వెంకట్రామయ్య, టీడీపీ నాయకులు సాంబశివారెడ్డి, బత్తిన వెంకట్రాముడు, మనోహర్‌చౌదరి, తిమ్మయ్యచౌదరి, వెంటకపతి, లోకనాథ్, ఎంఈవోలు తిమ్మారెడ్డి, రమేష్‌బాబు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నయిమున్నిసా బేగం, హైస్కూల్ హెచ్ఎం మాలతి, పీడీలు చందునాయక్, రంగస్వామి, ఆగోల రాజేష్ పాల్గొన్నారు.

హొళగుంద: ఇది ప్రజల పభుత్వమని కష్టాల్లో ఉన్నా సీఎం చంద్రబాబు సంక్షేమ పథకాలు ఇస్తున్నారని టీడీపీ నాయకుడు వీరభద్ర గౌడ్ అన్నారు. స్థానిక మురళి రైస్ మిల్ వద్ద ఇది మంచి ప్రభుత్వం నిర్వహించారు. వాల్మీకి సర్కిల్ నుంచి బస్టాండ్ వరకు సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రంగమ్మ, డీఎల్‌డీవో నాగేశ్వరరావు, ఏడీఏలు వేదమణి, సునీత, ఏవో ఆనంద్, ఏపీవో భక్తవత్సలం, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ గౌడ్, ఎస్సై బాల నరసింహులు పాల్గొన్నారు.

అవినీతికి పాల్పడితే చర్యలు : ఎమ్మెల్యే శ్యాంబాబు


రైతు కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే, టీడీపీ నాయకులు

తుగ్గలి: అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రమైన తుగ్గలిలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా తుగ్గలిలో 'ఇది మంచి ప్రభుత్వం'లో ఇంటింటికి తిరిగి స్టిక్కర్లు అతికించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారి సుధాకర్ రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, రాష్ట్ర కార్యదర్శి బత్తిన వెంకట్రాముడు, మనోహర్ చౌదరి, వెంకటపతి, తిరుపాల్ నాయుడు, వెంకట్రాముడు చౌదరి, ఎంపీపీ ఎర్రనాగప్ప, సర్పంచ్ రవి పాల్గొన్నారు.

'లడ్డూను అపవిత్రం చేసింది వైసీపీనే'

పత్తికొండ టౌన్, సెప్టెంబరు 24: తిరుపతి లడ్డూ ప్రసాదాన్ని గత వైసీపీ అపవిత్రం చేసిందని బీజేపీ కిసాన్‌మోర్చా అసెంబ్లీ ఇన్‌చార్జి సీసీ రంగన్న, జిల్లా ఉపాధ్యక్షులు సురేంద్ర, జిల్లా కార్యదర్శి గోరంట్ల ఆరోపించారు. మంగళవారం మాట్లాడుతూ వైసీపీ హయాంలో హిందూ ఆలయాలకు రక్షణ లేదన్నారు. లక్ష్మణస్వామి నాయుడు, కరణం చంద్రన్న, మేఘనాథ్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

హిందూ సంఘాల ఆందోళన

ఆదోని టౌన్, సెప్టెంబరు 24:తిరుపతి లడ్డూలో జంతువుల కొవ్వులు కలపడంపై వీహెచ్‌పీ, హిందూ సంఘాల నాయకులు మంగళవారం రాత్రి ఆందోళన చేశారు. స్థానిక వెంకటేశ్వర ఆలయం నుంచి భీమస్ కూడలి వరకూ ర్యాలీ నిర్వహించి, ధర్నా చేశారు.

కమిషనర్ సుడిగాలి పర్యటన

ఆదోని టౌన్, సెప్టెంబరు 24: కొత్తగా బాధ్యతలు చేపట్టిన మున్సిపల్ కమిషనర్ కృష్ణ మంగళవారం పట్టణంలో సుడిగాలి పర్యటన నిర్వహించారు. స్వచ్ఛ హి సేవాలో భాగంగా అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, సిబ్బందితో కలిసి శుభ్రం చేశారు. రాంజల చెరువును పరిశీలించి సిబ్బందిని వివరాలు అడిగారు.

సలహాలు పాటిస్తే అధిక దిగుబడి

పెద్దకడుబూరు, సెప్టెంబరు 24: వ్యవసాయ అధికారుల సహాలను పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చునని బనవాసి కేవీకే ఉద్యానవన శాస్త్రవేత్త మౌనిక అన్నారు. మంగళవారం రైతు సేవా కేంద్రంలో ఏవో వరప్రసాద్ ఆధ్వర్యంలో పొలంపిలుస్తోంది నిర్వహించారు. ముఖ్యఅతిథిగా టీడీపీ రైతుసంఘం అధికార ప్రతినిధి రమాకాంత రెడ్డి హాజరయ్యారు. మిరపలో తామర పురుగుతో ఆకులు ముడుచుకుపోయి, దిగుబడి తగ్గే ప్రమాదం ఉందని, జిగురు అట్టలను ఏర్పాటు చేసి, మందులను వాడాలన్నారు. ఇందు, శ్వేత పాల్గొన్నారు.

లబ్ధిదారులు గృహాల్లో నివాసం ఉండాలి


లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, సబ్ కలెక్టర్

ఆదోని, సెప్టెంబరు 24: లబ్ధిదారులు టిడ్కో గృహాలలో నివాసముండాలని ఎమ్మెల్యే పార్థసారథి, సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సూచించారు. మంగళవారం టిడ్కో గృహాలను పరిశీలించారు. టిడ్కో గృహాలకు వెళ్లడానికి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. తాగునీరు, విద్యుత్ దీపాలు, రహదారులు ఏర్పాటు చేసి మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ శాంత, మున్సిపల్ కమిషనర్ కృష్ణ, తహసీల్దార్ శివ రాముడు, అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, టిడ్కో ఇంజనీర్ ప్రసాద్ పాల్గొన్నారు.

గోదాం తనిఖీ..

పౌర సరఫరాల గోదాంను మంగళవారం సబ్ కలెక్టర్ తనిఖీ చేశారు. రేషన్ నిల్వ, రికార్డ్స్, భద్రత తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పౌర సరఫరాల డీటీ వలిబాషా పాల్గొన్నారు.

కొండను తవ్వి ఎలుకను పట్టి....

హాలహర్వి, సెప్టెంబరు 24: ఉపాధి హామీ పథకం తనిఖీలో కొండను తవ్వి ఎలుకను పట్టినట్లు మమ అనిపించారు. సామాజిక తనిఖీలు మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో 2023-2024 డ్వామా పీడీ అమరనాథ్ రెడ్డి అధ్యక్షతన సామాజిక తనిఖీ నిర్వహించారు. రూ.11కోట్లు పనులు చేయగా తనిఖీలో తేల్చింది రూ.2.34 లక్షలు మాత్రమే. అయితే మొక్కలు నాటే విషయంలో మాత్రమే అవినీతి జరిగిందని తేల్చి ముగించారు. జెడ్పీటీసీ లింగప్ప, ఏపీవోలు శ్రీనివాస్, హేమసుందర్ పాల్గొన్నారు.

అధైర్యపడకండి.. అండగా ఉంటాం

తుగ్గలి, సెప్టెంబరు 24: రైతులు అధైర్యపడొద్దని అండగా ఉంటామని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు భరోసా ఇచ్చారు. మంగళవారం కడమకుంట్లకు చెందిన ఆత్మహత్య చేసుకున్న రైతు రామచంద్ర భార్య సరస్వతికి రూ.7లక్షల ప్రభుత్వ పరిహారం చెక్కును అందజేశారు. టీడీపీ నాయకులు తుగ్గలి నాగేంద్ర, బత్తిన వెంకట్రాముడు, మనోహర్ చౌదరి, ఏవో పవన్ కుమార్, మాజీ సర్పంచ్ ఫక్కీరప్ప ఉన్నారు.

అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం : డీపీవో

వెల్దుర్తి, సెప్టెంబరు, 24: రాష్ట్ర అభివృద్ధిలో ప్రజలను భాగస్వామ్యం చేసేందుకు స్వర్ణాంధ్ర 2047పై ప్రజల నుంచి సలహాలు, సూచనలు స్వీకరిస్తున్నట్లు డీపీవో నాగరాజు నాయుడు అన్నారు. మంగళవారం మల్లెపల్లె గ్రామంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన క్యూఆర్ కోడ్‌ను స్మార్ట్‌ఫోన్‌లో స్కాన్ చేస్తే విజన్ డాక్యుమెంట్ పేజీతో లింక్ ఓపెన్ అవుతుందని తెలిపారు. పేరు, వృత్తి, ఈమెయిల్ తదితర వివరాలు నమోదు చేస్తే స్వర్ణాంధ్ర-2047 ప్రజాభిప్రాయ సేకరణ మొదలవుతుందన్నారు. ప్రజలు సలహాలు, సూచనలు అందజేయాలన్నారు. ఈవోఆర్డీ నరసింహులు, పంచాయతీ సెక్రటరీలు నిర్మల, రామాంజనేయులు పాల్గొన్నారు.

టీడీపీలో మైనార్టీల చేరిక

మంత్రాలయం, సెప్టెంబరు 23: మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన వైసీపీ వంద మంది మైనార్టీ నాయకులు టీడీపీలో చేరారు. మంగళవారం పార్టీ నాయకుడు రాఘవేంద్రరెడ్డి నివాసంలో ఎంపీ బస్తిపాటి నాగరాజు, మైనార్టీ నాయకులు ఆలాంబాషా, కేజీటీ గౌడ్స్, ఖాజా, రఫీక్, మహమ్మద్, హనీఫ్, మైబుబాషా, డిష్ బాషా, అల్తాఫ్‌కు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. మైనార్టీలు వరద బాధితులకు రూ.50వేల విరాళం అందజేశారు. రఘునాథరెడ్డి, రామకృష్ణారెడ్డి, ఆలం హుశేన్, బూదిరెడ్డి, మైబు, జమీర్, గౌస్, రామకృష్ణ, రమేష్, గుర్నింటి భీమిరెడ్డి, బొమ్మిశెట్టి రామయ్య తదితరులు పాల్గొన్నారు.


అండర్-14 విజేతలు లేబర్ కాలనీ పాఠశాల జట్టుకు ట్రోఫీ అందజేత

అట్టహాసంగా క్రీడా సంబరాలు

ఆదోని (అగ్రికల్చర్), సెప్టెంబరు 24 : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) క్రీడా సంబరాలు మంగళవారం మున్సిపల్ క్రీడా మైదానంలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు ముఖ్య అతిథి డిప్యూటీ ఈవో వెంకట రమణారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ శాంత క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. సెల్‌ఫోన్‌ల వల్ల బుద్ధి మాంద్యం, మానసిక వైకల్యం ఏర్పడుతుందని, క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. క్రీడలతో ఆరోగ్యం, నాయకత్వ లక్షణాలు వస్తాయన్నారు. మొదటిరోజు బాలుర కబడ్డీ, కోకో, వాలీబాల్, చెస్, సెటిల్, బ్యాడ్మింటన్ పోటీలు హోరాహోరీగా సాగాయి. అండర్ 14 కబడ్డీలో ఆర్ఆర్ లేబర్ కాలనీ పురపాలక పాఠశాల విద్యార్థులు విజేతలగా నిలిచారు. నేడు బాలికలకు అండర్ 14, అండర్ 17 కూడా పోటీలు ఉంటాయని నిర్వాకులు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాసులు, మున్సిపల్ హై స్కూల్ హెచ్ఎం మల్లికార్జున, నెహ్రూ మెమోరియల్ పాఠశాల హెచ్ఎం అలింసిద్ధికి, ఎస్‌జీఎఫ్ కోఆర్డినేటర్ నరసయ్య, రామన్న, ముజాహిద్, హుస్సేన్ పాల్గొన్నారు.

ఫ్యాక్షన్ గ్రామాలపై నిఘా ఉంచండి


పోలీసులతో మాట్లాడుతున్న ఎస్పీ బిందుమాధవ్

వెల్దుర్తి, సెప్టెంబరు, 24: ఫ్యాక్షన్ గ్రామాలపై నిఘా ఉంచాలని ఎస్పీ బిందుమాధవ్ పోలీసును ఆదేశించారు. మంగళవారం ఫ్యాక్షన్ గ్రామం చెరుకులపాడులోని పోలీస్ పికెట్‌ను తనిఖీ చేశారు. గ్రామంలో వీధుల వెంట తిరుగుతూ వివరాలు తెలుసుకున్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. సీఐ మధుసూధనరావు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వెల్దుర్తి, సెప్టెంబరు, 24: ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్సపొందుతూ మృతిచెందాడు. ఈనెల 18వ తేదీన మదార్‌పురం సమీపంలోని జాతీయ రహదారి-44 వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నంద్యాల జిల్లా డోన్ పట్టణానికి (తారకరామనగర్) చెందిన నాగలింగం (60) కారు బోల్తాపడి గాయపడ్డాడు. కర్నూలు పెద్దాసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందినట్లు కుమారుడు చంద్రశేఖర్ తెలిపారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బాలిక అదృశ్యం

వెల్దుర్తి, సెప్టెంబరు 24: మండలంలో ఎల్.బండ గ్రామంలో మైనర్ బాలిక మంగళవారం అదృశ్యమైంది. ఎస్ఐ తెలిపిన మేరకు.. సోమవారం సాయంత్రం ఇంటి సమీపంలోని దుకాణానికి సరుకులు తెచ్చేందుకు వెళ్లిన బాలిక ఇంటికి రాలేదు. కుటుంబసభ్యులు గాలించినా ఆచూకీ లేకపోవడంతో మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అశోక్ తెలిపారు.

మహిళ బలవన్మరణం

వెల్దుర్తి, సెప్టెంబరు, 24: మండలంలోని కొసనపల్లె గ్రామానికి చెందిన మహేశ్వరి తనకు పిల్లలు కలగకపోవడంతో విషద్రావణం తాగి బలవన్మరణానికి పాల్పడింది వివరాల మేరకు.. కడప పట్టణం రవీంద్రనగర్‌కు చెందిన మహేశ్వరి(24)ని, వెల్దుర్తి మండలం కొసనపల్లె గ్రామానికి చెందిన మధుగౌడ్‌కు ఇచ్చి మూడేళ్ల కిందట వివాహం చేశారు. అయితే సంతానం కలగకపోవడంతో కుటుంబంలో గొడవలు చోటుచేసుకున్నాయి. సోమవారం రాత్రి గొడవపడి విషద్రావణం తాగడంతో వెల్దుర్తి సీహెచ్‌సీకి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మంగళవారం వెల్దుర్తి సీహెచ్‌సీ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం భౌతికకాయాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. కుమార్తె మృతిచెందినట్లు తల్లి పద్మావతికి సమాచారం అందించారు. కాగా తన కుమార్తె మరణంపై తల్లి పద్మావతి అత్తింటి వారిపై ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అశోక్ తెలిపారు.

స్వర్ణ కవచ సమర్పణ సేవ

మంత్రాలయం, సెప్టెంబరు 24: వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళవాయిద్యాల మధ్య రాఘవ్రేంద స్వామి మూల బృందావనానికి బంగారు కవచం సమర్పణ సేవ రమణీయంగా చేశారు. మంగళవారం భాద్రపద సప్తమి కావడంతో పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆధ్వర్యంలో పండితులు బృందావనంకు సుప్రభాతం, నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం, తులసి అర్చన, విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. బంగారు, వెండి, పట్టు వస్త్రాలు, బెంగుళూరు నుంచి తెచ్చిన ప్రత్యేక పుష్పాలు, బంగారు కవచంతో అలంకరించారు.

అభివృద్ధే ధ్యేయం

ఆదోని టౌన్, సెప్టెంబరు 24: నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయమని, రోజుకు 18గంటలు పని చేస్తున్నట్లు ఎమ్మెల్యే పార్థసారతి అన్నారు. మంగళవారం వేణుగోపాల్ ఆలయంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. మోదీ జన్మదినాన రక్తదానం చేసిన వారికి ప్రశంసా పత్రాలు ఇచ్చారు.

కో ఆపరేటివ్ స్టోర్స్‌పై విచారణ చేయాలి


అధికారులను నిలదీస్తున్న సభ్యులు

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 24: కో-ఆపరేటివ్ స్టోర్స్ అక్రమాలపై విచారణ చేయాలని సభ్యులు బుట్టారంగయ్య, మాచాని శివకుమార్, సోగనూరు భీమిరెడ్డి, లలిత్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం కార్యదర్శి బసవరాజు అధ్యక్షతన స్టోర్స్ జనరల్‌బాడీ సమావేశం ఏర్పాటు చేశారు. స్టోర్స్ పర్సన్ ఇన్‌చార్జి రామరాజు హాజరయ్యారు. సమాచారం ఇవ్వకుండ జనరల్‌బాడీ సమావేశాన్ని ఎలా ఏర్పాటు చేశారని సభ్యులు నిలదీశారు. తూతూ మంత్రంగా సమావేశం నిర్వహించి అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకు ప్రయత్నిస్తే సహించేదిలేదన్నారు. సభ్యులను చేర్చుకునే విషయంపై కోర్టులో కేసు నడుస్తోందని అలాంటి సమయంలో కొత్త సభ్యులను ఎలా చేర్చుకుంటారని ప్రశ్నించారు. పర్సన్ ఇన్‌చార్జి రామరాజు స్పందిస్తూ సభ్యులు కోరితే మరోసారి సమావేశం నిర్వహిస్తామన్నారు సభ్యులు గత పాలకవర్గంలో జరిగిన లావాదేవీలపై పూర్తిస్థాయిలో విచారణ చేసి, అక్టోబరు 5వ తేదీకి వాయిదా వేయాలని కోరారు. దీంతో జనరల్‌బాడీ సమావేశాన్ని వచ్చేనెల 5వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు పర్సన్‌ఇన్‌చార్జి ప్రకటించారు.

హెచ్ఎంపై ఫోక్సో కేసు

పెద్దకడుబూరు, సెప్టెంబరు24 : ఆది ఆంధ్ర పాఠశాల హెచ్ఎంపై ఫోక్సో కేసు నమోదు అయినట్లు ఎస్ఐ నిరంజన్ రెడ్డి మంగళవారం తెలిపారు. వివరాల మేరకు... హెచ్ఎం సుప్రసాద్ పాఠశాల విద్యార్థినులకు అసభ్యకర వీడియోలను చూపిస్తున్నట్లు ఎంఈవో సువర్ణలా సునియమ్‌కు ఫిర్యాదు వచ్చిందన్నారు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇది రైతు ప్రభుత్వం



పొలంబడి నిర్వహిస్తున్న అధికారులు

మద్దికెర, సెప్టెంబరు 24: తమది రైతు ప్రభుత్వమని టీడీపీ జిల్లా కార్యదర్శి గూడూరు ధనుంజయుడు, ఏవో అధికారి ఉప్పర రవి అన్నారు. సోమవారం పెరవలి, ఎం.అగ్రహారం పొలాల్లో పొలం పిలుస్తుంది నిర్వహించారు. సిబ్బంది జాకీర్, ఆనంద్, రాణి, కవిత, నాయకులు చెన్నంపల్లి మల్లికార్జున, మదనంతపురం శ్రీనివాసులు, హరినాథ్‌గౌడ్, ఈశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇది మంచి ప్రభుత్వం


స్టిక్కర్లు అతికిస్తున్న నాయకులు, అధికారులు

మద్దికెర, సెప్టెంబరు 24: టీడీపీ ప్రభుత్వం మంచిదని మాజీ సర్పంచ్ లక్ష్మన్న, ఏపీవో నర్సిరెడ్డి, తాలుకా తెలుగు యువత ఉపాధ్యక్షుడు ఎన్.చంద్ర మోహన్, మాజీ ఎంపీటీసీ సుధాకర్ చౌదరి అన్నారు. మంగళవారం ఎం.అగ్రహారం గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల ఎస్సీ సెల్ నాయకులు ఆనంద కుమార్, సోషల్ మీడియా కన్వీనర్ హుశేన్‌పీరా, ఆవుల పెద్దన్న, మెడికల్ శ్రీనివాసులు, ఆంథోని, కార్యదర్శి హరికృష్ణ, మనోజ్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

మురుగు లేకుండా చేశారు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


గరుసు వేస్తున్న ఆలూరు ఎస్ఐ వెంకట నరసింహులు

ఆలూరు, సెప్టెంబరు 24: మోడల్ స్కూల్ వద్ద మురుగునీటిపై మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన పోలీసు కవాతులా కథనానికి పోలీసు అధికారులు స్పందించారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఆలూరు ఎస్ఐ వెంకట నరసింహులు సిబ్బందితో కలసి నీరు నిల్వ ఉండకుండా గరుసు వేయించారు. ప్రజలు, విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందిని చూసి శ్రమదానంతో బాగుచేశామని ఎస్ఐ అన్నారు.

జగనన్న కాలనీలో భూకబ్జాలు చేయలేదు

కోసిగి, సెప్టెంబరు 24: సజ్జలగుడ్డం రోడ్డులోని జగనన్న కాలనీలో భూకబ్జా చేయలేదని వైసీపీ నాయకుడు పులుసు రాజు అన్నారు. మంగళవారం కుటుంబ సభ్యులతో కలిసి మాట్లాడుతూ జగనన్న కాలనీలో అక్రమ ఇసుక తరలించిన మాట వాస్తవమేనని, పోలీస్‌స్టేషన్‌లో కేసు ఉందన్నారు. భూకబ్జా చేశానని టీడీపీ నాయకుడు ముత్తురెడ్డి చేసిన ఆరోపణలో వాస్తవం లేదన్నారు.

టీడీపీలో యువతకు ప్రాధాన్యం


చౌదరిని సన్మానిస్తున్న నాయకులు

ఆదోని, సెప్టెంబరు 24: టీడీపీలో యువతకు ప్రాధాన్యం ఉందని తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి భూపాల్ చౌదరి అన్నారు. మంగళవారం స్వగృహంలో బాలయ్య అభిమాన సంఘం అధ్యక్షుడు సజ్జాద్ ఆధ్వర్యంలో భూపాల్‌చౌదరి జన్మదిన వేడుకలు నిర్రవహించారు. భారీ కేక్ కట్ చేసి, గజమాలతో సత్కరించారు. త్రిమ్మ, విజయ్, వెంకటేష్, రామకృష్ణ, ఖాసీం, వీరేష్, సోమశేఖర్, భీమస్వామి, షఫీ, నూర్ అలీ పాల్గొన్నారు.

కాసులిస్తేనే కాన్పులు!

- కోసిగి పీహెచ్‌సీలో మేల్ నర్సు దోపిడీ
ఆవేదన వ్యక్తం చేస్తున్న బాధితులు


మేల్ నర్సుతో టీడీపీ నాయకులు, బాధితుల వాగ్వాదం

కోసిగి, సెప్టెంబరు 24: ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచిత చికిత్స అంటూ ప్రభుత్వం, అధికారులు, నాయకులు భరోసా కల్పిస్తుంటే, కొందరు సిబ్బంది కాసులకు కక్కుర్తిపడి బాధితులను ఇబ్బంది పెడుతున్నారు. కోసిగి ప్రభుత్వాసుప్రతిలో కాన్పు చేయాలంటే రూ.2వేల నుంచి రూ.3వేలు డబ్బులు వసూలు చేస్తున్నారని కందుకూరు గ్రామానికి చెందిన బాధితులు తిమ్మప్ప, కందుకూరు వీరేష్ ఆరోపించారు. మంగళవారం మేల్ స్టాఫ్ నర్సు రాఘవేంద్రపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితుల కథనం మేరకు.. తన కూతురు కాన్పుకు రూ.1,500 తీసుకున్నాడని కందుకూరు గ్రామానికి చెందిన హరిజన తిమ్మప్ప, వీరేష్ ఆరోపించారు. తిమ్మప్ప కుమార్తె హరిజన బసెమ్మ రెండో కాన్పు కోసం ఆరు రోజుల క్రితం వచ్చామని, మగ శిశువు జన్మించగా రూ.1,500 స్టాఫ్ నర్సు తీసుకున్నట్లు హరిజన తిమ్మప్ప ఆవేదన వ్యక్తం చేశారు. గొడవ జరుగుతుండటంతో టీడీపీ నాయకులు ముత్తురెడ్డి, బస్సయ్య, నర్సన్న, మూకోడు, రామాంజి, పెద్ద ఎత్తున బాధితులు చేరుకున్నారు. ఇక్కడ పనిచేసే ఇద్దరు వైద్యులు నిరసనలో ఉంటంతో ఆసుపత్రిలో లేరు. ఇప్పటికైనా స్పందించాలని బాధితులు కోరుతున్నారు.

రూ.1,500లు తీసుకున్నారు : తిప్పమ్మ, కందుకూరు

ఆరు రోజుల నా కూతురు బన్నమ్మను రెండో కాన్పు కోసం తీసుకువచ్చాను. మగశిశువు జన్మిం చాడు. ఆశా వర్కర్ వచ్చి సార్‌కు రూ.1,500లు ఇవ్వాలని అడిగింది. అప్పు తెచ్చి ఇచ్చాను.

డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు చేశాం

స్టాఫ్ నర్సు డబ్బులు వసూలు చేస్తున్నాడన్న విషయం నా దృష్టికి వచ్చింది. డీఎంహెచ్‌వో, డిప్యూటీ డీఎంహెచ్‌వోకు పిర్యాదు చేశాం. పిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. - మనోజ్ కుమార్, వైద్యాధికారి